Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.9

July 2024




## సామాజిక దురాచారాలు

ఎడిటోరియల్

# ఎదురీదాలి

భారతదేశం భౌగోళికంగా, సాంస్కృతికంగా ఎంత వైవిధ్యమైనదో విశ్వాసాలు, ఆచారాల పరంగా కూడా అంత భిన్నమైనది. రాష్ట్రాలవారీగా, ప్రాంతాలవారీగా అనేక దురాచారాలు, మూఢ నమ్మకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. భారతదేశం 21వ శతాబ్దపు సూపర్ పవర్‌గా మారబోతుందనే ఊహాగానాలు ఆశల్ని రేకెత్తిస్తుంటే మరోవైపు నేటి సమాజం మూఢనమ్మకాల్ని, సామాజిక దురాచారాల్ని ఇంకా వదలకపోవడం శోచనీయంగా ఉంది.

దురాచారం అంటే చెడ్డ ఆచారం. చెరుపు చేసేది. హానిచేసేది. ఐక్యతను చెడగొట్టేది. సాంఘిక దురాచారాలు వ్యక్తిగత లేక బలమైన వర్గ స్వార్థ ప్రయోజనాల కోసం సమాజంలో ఏర్పడ్డాయి. బాల్య వివాహం, సతీ సహగమనం, వెట్టి చాకిరి, సంఘ బహిష్కరణ లేక వెలివేయడం, దేవదాసీ వ్యవస్థ, కులతత్వం, హింస, అంటరానితనం, బాలకార్మికులు, దేవాలయ ప్రవేశ నిషిద్ధం, స్త్రీ సామాజిక నిర్బంధం. స్త్రీ పురుష అసమానతలు, భ్రూణ హత్యలు, వరకట్నం, కన్యాశుల్కం, శూద్రులకు, దళితులకు విద్య నిషిద్ధం, లంచగొండితనం, బంధుప్రీతి, బాడీషేమింగ్, అసహనం... మొదలైనవి గతం లోనూ, కొన్ని ప్రస్తుతంలోనూ దురాచారాలు గా ఉంటూ అన్ని వ్యవస్థల్ని, కుటుంబాల్ని పట్టి పీడిస్తూ, సమాజాన్ని విష వలయంలోకి, అంధవిశ్వాసంలోకి నెట్టి వేస్తున్నాయి.

నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఒక భయంకర దురాచారం 'అసహనం'. ఇది కుటుంబాలలో, సమాజంలో, రాజకీయాలలో రోజు రోజుకి పెరిగిపోతుంది. కొంతమంది స్వార్థపరులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం మత పరంగా, రాజకీయంగా ఉద్రేకపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ, ఒకరంటే ఒకరికి ద్వేషం పుట్టిస్తూ, సమాజంలోని వ్యక్తుల మధ్య అల్లర్లు సృష్టిస్తూ, దాడులు చేస్తూ, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతూ తమ పబ్బం గడుపుకొంటున్నారు. ఈ విషయాల్ని ప్రస్తావిస్తూ మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ ఇండియా ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ జస్టిస్ మార్కండేయ కట్జూ "90% మంది భారతీయులు మూర్ఖులు...వారి తలలో మెదడు లేదు.. అల్లర్ల వెనుక రెచ్చగొట్టే వ్యక్తి ఎవరున్నారోనని గ్రహించకుండానే పిచ్చి మనుషులు గొడవలు ప్రారంభిస్తారని"ఒక సెమినార్‌లో ఆయన అన్నారు. క్రైస్తవ సంఘాల్లో, సంస్థల్లో కూడా తమ స్వార్థ ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడానికి, తమ ప్రాబల్యం కాపాడుకోవడానికి విశ్వాసులను రెచ్చగొట్టే సంఘ నాయకులు ఉన్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలి.

మూఢ నమ్మకాలు, సామాజిక దురాచారాలతో నిండి ఉన్న చీకటి సమాజంలోంచి యేసుక్రీస్తు సువార్త ద్వారా వెలుగులోకి పిలువబడి, నూతన సృష్టిగా మార్చబడ్డాము, పాతవి గతించాయి (2 కొరింథీ 5:17). గతించిపోయిన వాటిలో కులతత్వం, లంచగొండితనం, వరకట్నం, మూఢనమ్మకాలు, అసహనం అన్నీ ఉన్నాయి. నూతన సృష్టిలో వీటికి స్థానం లేదు. కానీ నేటి క్రైస్తవ సంఘంలో రోజురోజుకు క్రైస్తవ విశ్వాసానికి, మూఢనమ్మకాలకు, సామాజిక దురాచారాలకు మధ్య అంతరం తగ్గిపోయి సాన్నిహిత్యం పెరుగుతుంది. విశ్వాసులు దేవుని వాక్యానికి ప్రాధాన్యతను తగ్గించి మూఢవిశ్వాసాలు, సామాజిక దురాచారాల విషవలయంలో చిక్కుకుంటూ, తమ్మును తాము సమర్థించుకుంటున్నారు. ఉదాహరణకు కులజాడ్యం క్రైస్తవ సంఘాల్లో, సంస్థల్లో వేళ్ళూనుకుపోయి కులపరంగా ఆరాధనలు చేసుకునే స్థాయికి ఎప్పుడో వెళ్ళింది. లంచమివ్వడం, కట్నాన్ని తీసుకోవడం, కుటుంబాల్లో కలతలు రేగితే విడాకుల గురించి పోరాడడం తప్పుగా భావించడం లేదు. సంఘం లోకాన్ని ప్రభావితం చేయాల్సింది పోయి సంఘాల్లో లోక ఆచారాలు, పద్ధతులు, మూఢనమ్మకాలు తిష్ఠ వేసుకుని కూర్చున్నాయి. విశ్వాసులు లోకానికి ఉప్పుగా, వెలుగుగా ఉండి ప్రభావం చూపవలసినవారు పరిస్థితులకు అనుగుణంగా రాజీపడిపోతూ శక్తిహీనులుగా, పాపాన్ని ఎదిరించలేని వారుగా మిగిలిపోతున్నారు.

దేవుని వాక్యం ద్వారా మన హృదయం, మనస్సు నిజంగా పోషించబడుతూ, దేవునితో సన్నిహిత సహవాసం కలిగి ఉంటే క్రైస్తవ విశ్వాసానికి, మూఢవిశ్వాసాలకు, సామాజిక దురాచారాలకు అంతరం స్పష్టంగా కనబడుతుంది. సత్యం మనల్ని స్వతంత్రులనుగా చేస్తుంది. అప్పుడు వాటికి ఎలా దూరంగా ఉండాలో, దేవునికోసం వాటిని ఎదిరించి ఎలా నిలబడాలో స్పష్టంగా అర్థమవుతుంది, ధైర్యం కూడా వస్తుంది. విశ్వాస జీవితంలో దేవునికోసం నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయాలు ఎన్నో వస్తాయి. సామాజిక దురాచారాలను, మూఢనమ్మకాలను ఎదిరించే పరిస్థితులు వచ్చినప్పుడు ఎంత వెల చెల్లించాల్సి వచ్చినా దేవునికి లోబడడమా లేక రాజీపడడమా అనేది మనచేతుల్లోనే ఉంటుంది.

నదీ ప్రవాహంలో బలమైన రాతిబండలు, ప్రాణమున్న చేపలు తప్ప అన్నీ కొట్టుకుపోతాయి. అలాగే క్రీస్తులో స్థిరంగా ఉన్న విశ్వాసులు తప్ప నామాకార్థ క్రైస్తవులు, అల్ప విశ్వాసులు సమాజంలోని దురాచాలకు, మూఢనమ్మకాలకు కొట్టుకొనిపోతారు. నిజ క్రైస్తవులు ఈ లోకంలో ఈ దురాచారాల ప్రవాహాలకు జీవమున్న, బలమైన చేపలవలె ఎదురీదాలి.

చాలా మంది విశ్వాసులు యధార్థంగా క్రైస్తవ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా యధార్థంగా ఉన్నా లోకం సహించలేదు. పతనమైన ఈ లోకంలో కొన్నిసార్లు పవిత్రమైన, నిజాయితీ గల విశ్వాసి ఉండి పరిస్థితులతో పోరాడవలసి వస్తుంది. ఈ ప్రక్రియలో తప్పుడు ఆలోచనలతో, క్రియలతో ఏకీభవించ లేక మానసిక హింసను ఎదుర్కోవచ్చు. కాలం మారినా వీళ్ళు మారలేదు అనే నిందలు ఎదుర్కోవచ్చు. అయితే యధార్థవంతులకు ఆయన తోడుగా ఉంటాడు గనుక (సామె 3:32) వారు సింహము వలె ధైర్యముగా ఉంటారు. (సామె 28:1). నిజాయితీతో కూడిన జీవితం, అనేకులను, లోకాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రభువును చూపిస్తుంది, దేవునికి మహిమను తీసుకువస్తుందని మరవకూడదు.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 9 July 2024
UESI Publication Trust - Andhra Pradesh Branch



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod, Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI Publication Trust -AP Branch
C/o. UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

STUDENTS (1 Year) - Rs. 150
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (1 Year) - Rs.300
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**Account Name: UESI-AP-VIDYARTHI JWALA**
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**Account Name: UNION OF EVANGELICAL STUDENTS**
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**Account Name: UESI-AP-PUBLICATION TRUST**
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**
**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

August : Minority - Majority
September : Core Values

**Note:** Please send your writeups on or before
**10th of every month**


# నిరాశావాదం వద్దు



ఈ రోజుల్లో నిరాశావాదం విశ్వాసుల్ని పట్టి పీడిస్తుంది. లాభంలేదు అన్నట్లు వారు తమ చేతుల్ని తిప్పుతూ సమాజం పూర్తిగా చెడిపోయిందని అంటుంటారు. ఎక్కడ చూసినా నిస్సహాయతే. ఇక మనమేం చేయలేము, నిరీక్షణ లేదు, ప్రభువు రాకడే తరువాయి అన్నట్లు వారు ఉంటారు.


నిరాశావాదులమై, ఈనాటి సమాజంలో మనం ఏమీ చేయలేము అన్న ధోరణిలో ఉంటే, మనం తీవ్రమైన వేదాంత పిచ్చిలో ఉన్నట్లే అని చెప్పడానికి ధైర్యం చేస్తున్నాను. క్రైస్తవులు సమాజంపై ప్రభావం చూపించలేరు అని అనడం చాలా హాస్యాస్పదం. బైబిల్ పరంగా, చరిత్రపరంగా ఈ అభిప్రాయం తప్పు. శతాబ్దాల చరిత్రలో క్రైస్తవ్యం సమాజంపై చాలా ప్రభావం చూపించింది.

నీ దేశం దేవునికి ఇంకా ఇష్టంగా తయారవ్వాలనే కోరిక నీకుందా? అయితే, మనకొరకు తన ప్రాణాన్ని అర్పించిన దేవునికి సమర్పించుకుందాం. ఆయన చేతిలో పనిముట్టుగా వాడబడేటట్లు, సమాజంలో ఉప్పుగా, వెలుగుగా ఉండేటట్లు మనల్ని మనం దేవునికి అప్పగించుకొందాం.సంఘం సంపూర్ణంగా క్రీస్తుకు సమర్పించుకుంటే, ప్రతి దేశంలో ఎంతో శక్తివంతమైన ప్రభావం, ఫలితాన్ని చూస్తాం.

– జాన్‌స్టాట్

# లోపలి పేజీల్లో...


- ఎదురీదాలి - 2
- సామాజిక దురాచారాలు - 4
- క్రైస్తవ సమకాలీన దురాచారాలు - 8
- విడాకులు - 12
- గృహహింస - 14
- నులివెచ్చని స్థితి - 18
- విశ్వమాత - 19
- ఈ తరం భయాలు - 22
- ఒక్కసారి ఆలోచించు! - 24
- పాపము - 25
- అద్భుతం- 29
- ఇలా ఎందుకో మరి?- 31
- నీకేమైంది?- 32



# సామాజిక దురాచారాలు

సమాజానికి ప్రతికూలంగా ప్రభావితం చేసే హానికరమైన పద్ధతులు లేదా ఆచారాలను సామాజిక దురాచారాలు అని నిర్వచించవచ్చు. వాటిలో ముఖ్యంగా కులతత్వం, తప్పుడు వాగ్దానాలతో కూడిన స్కీములు, అవినీతి, స్వార్థం, లైంగిక వేధింపులు.. మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. వ్యక్తిగత లేక బలమైన వర్గము యొక్క స్వార్థ ప్రయోజనాల కోసం సమాజములో ఈ సామాజిక దురాచారాలు ఏర్పడ్డాయి. కొన్ని ముఖ్యమైన సామాజిక దురాచారాల ను కొంత లోతుగా పరిశీలిద్దాం.

## కులం

సమాజంలో ఏ వ్యక్తినైనా తేలికగా గుర్తించడానికి పూర్వకాలం నుండి రూపొందించబడిన ఒక వ్యవస్తే ఈ కుల వ్యవస్థ. “తమలో తాము వివాహాలు చేసుకుంటూ, ఒకే విధమైన జీవన సరళిని కొనసాగిస్తూ వచ్చిన సామాజిక వర్గాలకు కులాలు అని పేరు”. వృత్తి, ఆచారాలు, సామాజిక స్థాయి వంటి అనేక అంశాలు కులాల్లో కొనసాగేవి. వంశపారంపర్యంగా పాటించే ఒక సామాజిక దురాచారమే కులము. యునిసెఫ్ అధ్యయనాల ప్రకారం కులవివక్ష ప్రపంచవ్యాప్తంగా 25 కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేస్తుంది. ఈ కుల వ్యవస్థ ప్రముఖంగా ఆసియా ఖండంలోని భారతదేశం, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, జపాన్, ఆఫ్రికా ఖండాలలో ప్రభలంగా ఉంది. భారత దేశంలో కుల వ్యవస్థ వల్ల కొన్ని దురాచారాలు ఏర్పడ్డాయి. కులం లేదా వర్ణం అనేది హిందూ మతానికి చెందిన వర్గీకరణ.

### సమానత్వం గురించి భారత రాజ్యాంగంలో ఉన్న చట్టాలు

- సామాజిక సమానత్వం, పబ్లిక్ ప్రాంతాలకు అనుమతి (ఆర్టికల్ 15)
- ప్రభుత్వ ఉద్యోగాలలో సమానత్వం (ఆర్టికల్ 16)
- అంటరానితనం నిర్మూలన (ఆర్టికల్ 17)
- బిరుదుల రద్దు (ఆర్టికల్ 18)

ఈ చట్టాలు సమానత్వాన్ని ప్రతిపాదిస్తున్నప్పటికినీ ఇప్పటికీ ఈ కులతత్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. దీనివలన పరువు హత్యలు, వివక్ష వంటివి సమాజంలో అనేకమందిని ఇంకా బాధిస్తూనే ఉన్నాయి. స్వార్థ రాజకీయాలు కూడా వీటిని పెంచి పోషిస్తున్నాయి.

భారత దేశంలో నిజమైన సమానత్వాన్ని సాధించాలంటే ఈ దురాచారాల మీద నిరంతర పోరాటం జరగాల్సి ఉంది. రోమా 10:12 లో ఇలా ఉంది “యూదుడని గ్రీసు దేశస్థుడని భేదము లేదు;

ఒక్క ప్రభువే అందరికి ప్రభువై యుండి, తనకు ప్రార్థన చేయు వారందరియెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు". ప్రతి జనములోను ప్రతి వంశములోను ఆయా భాషలు మాట్లాడేవారిలోను ఆయనకు పిల్లలు ఉన్నారు (ప్రకటన 7:9). బైబిల్ అందరికి సమానత్వాన్ని ఆపాదిస్తూ ఉంది. అందుకే విశ్వాసులమైన మనం ఈ విషయాలలో స్థిరమైన ఆలోచన కలిగి ఈ కులతత్వాన్ని నిర్మూలించడంలో మనవంతు పాత్ర పోషించాలి.

2 కొరింథీ 5:17 ప్రకారం క్రీస్తు యేసునందున్నవారు నూతన సృష్టి. గతించిపోయిన పాత వాటిలో కులం కూడా ఉంది. నూతన సృష్టిలో కులానికి స్థానం లేదు. కులానికి ప్రాధాన్యం ఇచ్చేవారు నూతన సృష్టిగా మార్చబడడానికి సహకరించడంలేదన్న మాట. విశ్వాసుల్లో కొంతమంది తమ కులాన్ని బట్టి అనవసరమైన గాంభీర్యాన్ని ప్రదర్శించడం, కులాన్ని బట్టి ఒక వ్యక్తిని ఆదరించడం లేదా ఆదరించకపోవడం నిజంగా అమానుషం.

"యేసుక్రీస్తు ప్రభువు నేటి భారతీయ విశ్వాసులతో మాట్లాడాల్సి వస్తే ఆయన మాటలిలా ఉండేవి. ఎవడైనను తన కులాన్ని విడిచిపెట్టకపోతే అతడు నాకు శిష్యునిగా ఉండలేడు" అని విశాల్ మంగళ్వాడి అంటారు.

విచారకరమైన విషయం ఏమంటే విశ్వాసులు చాలా మంది వివాహ విషయంలోకి వచ్చే సరికి వారిలో ఉన్న కులతత్వాన్ని చాలా పాలిష్డ్‌గా బయట పెడతారు. 2 కొరింథీ 6:15లో విశ్వాసి అవిశ్వాసిని వివాహం చేసుకోకూడదు అని బైబిల్ స్పష్టంగా చెప్తుందే గాని కుల ప్రస్తావన బైబిలులో ఎక్కడా లేదు. బైబిలు ప్రాధాన్యం ఇవ్వని కులానికి ఆయన పిల్లలు కూడా ప్రాధాన్యం ఇవ్వకూడదు.

## స్కీమ్స్

ఈ రోజుల్లో ఎదుర్కొంటున్న మరొక సామాజిక దురాచారం ఈ స్కీముల బిజినెస్. ఎంతో ఆకర్షణీయమైన పథకాలతో, అడ్వర్టైజ్మెంట్స్‌తో ప్రజలను మభ్యపెట్టి వారికి ధనాశ చూపి వారిని మోసగించడం ఈ స్కీముల యొక్క ముఖ్య ఉద్దేశం. మానవుని యొక్క బలహీనతలను ఆధారం చేసికొని అనేకమందిని ఈ ఉచ్చులోకి దించుతున్నారు. బైబిల్‌లో చెప్పబడినట్లు మనకు కలిగి ఉన్న దానిలో తృప్తి కలిగి ఉండడం అనే ప్రాథమిక సూత్రాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఫిలిప్పీ4:11లో పౌలు ఇలా అంటాడు "నేనేస్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను". ఈజీమనీ వస్తుందని చెప్పే అనేక స్కీములలో ఏదో ఒక మోసం దాగి ఉంటుంది. ఆ విషయాన్ని మరచి కొద్దిమంది విశ్వాసులు కూడా ఈ ఈజీమనీ కోసం ఆశపడుతున్నారు. ఈ విషయంలో మనం జాగ్రత్త పడాలి. స్వార్థ పూరితంగా నడుస్తున్న ఇలాంటి బిజినెస్‌లలో ముఖ్యంగా పేదవారు, మధ్యతరగతి వారు బలి అవ్వడం చాలా బాధాకరం. ఈ సామాజిక రుగ్మతలను అంతం చేయడానికి మిషనరీస్ బ్యాంకింగ్ వ్యవస్థను భారత దేశంలో ప్రవేశపెట్టారు. అయితే నైతిక ప్రవర్తన విషయంలో బాగా వెనకబడిన మన దేశం అవినీతి నివారణ విషయంలో శ్రద్ధ చూపడం లేదు.

## అవినీతి

భారతదేశంలో ఉన్న మనకు బాగా పరిచయం ఉన్న అలవాటైన, అనుభవంలోనికి వచ్చిన సామాజిక దురాచారం ఈ అవినీతి. భారతదేశంలో అవినీతి అనేది కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వ సంస్థల ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే సమస్య. భారతదేశం వెనుకబాటు తనానికి అవినీతి కారణమని అనేకమంది ఆర్థిక వేత్తలు సూత్రీకరించారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, 62% కంటే ఎక్కువ మంది భారతీయులు ఏదో ఒక సమయంలో ప్రభుత్వ అధికారికి లంచం ఇచ్చారు, మరొక నివేదిక ప్రకారం 50% మంది భారతీయులు ప్రభుత్వ కార్యాలయాల ద్వారా నిర్వహించబడే సేవలను పొందడానికి లంచాలు చెల్లించడం లేదా పరిచయాలను ఉపయోగించడం వంటి ప్రత్యక్ష అనుభవాన్ని కలిగి ఉన్నారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ యొక్క 2023 కరప్షన్



పర్సెప్షన్స్ ఇండెక్స్‌లో, 180 దేశాలను 0 ("అత్యంత అవినీతి") నుండి 100 ("చాలా క్లీన్") వరకు స్కోర్ చేసింది, భారతదేశం 39 స్కోర్ చేసింది. స్కోరు ప్రకారం, 180 దేశాలలో భారతదేశం 93వ స్థానంలో నిలిచింది.

### భారతదేశంలో అవినీతికి కారణాలు

మానవుడు ఎదుర్కొనే ప్రతి సమస్యకు మూలకారణము పాపం అని బైబిల్ నొక్కి చెబుతుంది. పతనమైన మానవుడు స్వార్థంతో అవినీతిలో కూరుకుపోయాడు. అంతే కాక మితిమీరిన నిబంధనలు, సంక్లిష్టమైన పన్ను, లైసెన్సింగ్ వ్యవస్థలు, అపారదర్శక బ్యూరోక్రసీ, విచక్షణలేని అనేక ప్రభుత్వ విభాగాలు, సేవల పంపిణీపై ప్రభుత్వ నియంత్రిత సంస్థల గుత్తాధిపత్యం మరియు పారదర్శక చట్టాలు, ప్రక్రియలు లేకపోవడం వంటివి అవినీతికి మూల కారణాలుగా చెప్పవచ్చు. భారతదేశం అంతటా అవినీతిని తగ్గించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో ఏ మాత్రం పురోగతి లేకపోవడం వలన కూడా ఈ సామాజిక రుగ్మత ప్రబలిపోతున్నది. ఈ రోజుల్లో ఒకరి స్వార్థానికి మరొకరు బలి అవ్వడం మనం మన సమాజంలో కళ్ళారా చూస్తూనే ఉన్నాం.

నిర్గమ 23:8లో "లంచము తీసికొనకూడదు; లంచము దృష్టిగలవానికి గ్రుడ్డితనము కలుగజేసి, నీతిమంతుల మాటలకు అపార్థము చేయించును", ద్వితీ 16:19 లో "నీవు న్యాయము తప్పి తీర్పుతీర్చకూడదు; పక్షపాతము చేయకూడదు; లంచము పుచ్చుకొనకూడదు. ఏలయనగా లంచము జ్ఞానుల కన్నులకు గ్రుడ్డితనము కలుగజేయును నీతి మంతుల మాటలకు అపార్థము పుట్టించును", ద్వితీ 27:25లో "నిర్దోషికి ప్రాణహాని చేయుటకు లంచము పుచ్చు కొనువాడు శాపగ్రస్తుడని చెప్పగా ప్రజలందరు ఆమేన్ అనవలెను", ప్రసంగి 7:7 లో "అన్యాయము చేయడం వలన జ్ఞానులు తమ బుద్ధిని కోల్పోతారు; లంచము పుచ్చుకొనుటచేత మనస్సు చెడును". అని రాయబడి ఉంది. కాబట్టి ఈ విషయంలో విశ్వాసులమైన మనం సమాజానికి మాదిరికరంగా ఉండాలి.

### స్వార్థం

స్వార్థం అనేది ఇతరులతో సంబంధం లేకుండా



తన కోసం జీవించడం లేదా తన స్వంత ప్రయోజనం, ఆనందం లేదా సంక్షేమం కోసం ఇతరులను కాదని తనకోసమే జీవించే విధానాన్ని స్వార్థపూరిత జీవితం అంటారు. "మీ స్వీయ అభివృద్ధిపై దృష్టి పెట్టండి ఇతరుల ప్రయోజనాలను పట్టించుకోకండి" అనేదే స్వార్థం. స్వార్థం అనే పదానికి నిఘంటువు నిర్వచనం 'ఒకరి స్వంత ప్రయోజనాలకు సంబంధించిన ఆందోళన'. ప్రస్తుతం లోకమంతా స్వార్థంతో నిండి ఉంది. నేను, నా అనే పదాల వాడుక మనం తరచుగా వింటుంటాం. స్వార్థం ఇతరుల మేలు కంటే తన మేలు ను ముందు ఉంచుతుంది. ఇది పూర్తిగా బైబిల్‌కు వ్యతిరేకమైన లక్షణం, యేసుక్రీస్తు బోధలో ఈ విషయం సుస్పష్టం. లూకా10:27లో ప్రభువైన యేసుక్రీస్తు చెప్పిన మాట "నీ దేవుడైన ప్రభువును నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణమనస్సుతోను, నీ పూర్ణ శక్తితోను, నీ పూర్ణవివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్నువలె నీ పొరుగువాని ప్రేమింపవలెననియు, రాయబడియున్నదని చెప్పెను". లూకా 3:11 "అతడు రెండు అంగీలుగలవాడు ఏమియు లేనివానికియ్య వలెననియు, ఆహారముగలవాడును అలాగే చేయవలెననియు వారితో చెప్పెను". ఈ వచనాలలో స్వార్థానికి విరుగుడు ప్రేమ అని చెప్పబడింది. కాబట్టి మనం మన వైఖరిలో మార్పు చెంది మన సమాజంలో అందరి ప్రయోజనం కోసం కృషి చేద్దాం.

### లైంగిక వేధింపులు

చట్టం ప్రకారం 'లైంగిక వేధింపు' అనేది ప్రత్యక్షంగా వ్యక్తీకరించబడిన లేదా సూచించబడిన, ఏదైనా అవాంఛనీయ లైంగిక ప్రవర్తన, శారీరక సంబంధము లేదా లైంగిక కోరిక లేదా అభ్యర్థన, లైంగిక వ్యాఖ్యలు చేయడం, లేదా అశ్లీలత చూపడం లేదా ఇతర అభ్యంతరకరమైన విషయాలు, లేదా

మాటలతో, మాటలు లేకుండానే శారీరక కదలికలు, హావభావాలతో ప్రవర్తించడం.

**లైంగిక వేధింపులు సంభవించే అనేక పరిస్థితులు**

1. పని చేసే ప్రాంతంలో ప్రాధాన్యత ఇస్తాననే వాగ్దానం ద్వారా లోబరచుకోవడం.
2. తప్పుడు సంకేతాలు, అసభ్య ప్రవర్తనతో ఒక వ్యక్తి యొక్క ఉద్యోగ స్థితి, వర్తమానం లేదా భవిష్యత్ గురించి స్పష్టమైన ముప్పు వాటిల్లుతుందని భయపెట్టడం.
3. పనిలో జోక్యం చేసుకోవడం లేదా భయపెట్టే లేదా అభ్యంతరకరమైన లేదా ప్రతికూలమైన పని వాతావరణాన్ని సృష్టించడం.
4. అవమానకరముగా ప్రవర్తించడం ద్వారా మహిళా ఉద్యోగి ఆరోగ్యం లేదా భద్రతను ప్రభావితం చేయటం మొదలైనవి.

లైంగిక వేధింపుల రూపాలలో క్విడ్‌ప్రోకో లైంగిక వేధింపులు కూడా ఉన్నాయి. అధికారంలో ఉన్న వ్యక్తి, ఉద్యోగి పురోగతికి బదులుగా ప్రతికూల చర్యల ద్వారా లైంగిక ప్రయోజనాల కోసం ఉద్యోగిని ఒత్తిడి చేయడం. భయపెట్టే పని వాతావరణాన్ని సృష్టించడంతోపాటు, అననుకూల పని వాతావరణాన్ని సృష్టించడం కూడా ఈ కోవలోకే వస్తుంది.

స్త్రీలపై జరిగే అత్యాచారాలన్నింటిలో పైకి కనబడకుండా ఎన్నోసార్లు, లోలోపల కృంగిపోయే అంశాలు ఉంటాయి. ఈ విధమైన వేధింపులకు పదే పదే గురి అవడం వలన నిరాశ, నిస్పృహలకు లోనై కొన్నిసార్లు ఆత్మహత్యలకు కూడా దారి తీయవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే ఆమెపై జరిగే అతి హేయమైన శారీరక మానసిక అత్యాచారం ఈ 'లైంగికపరమైన వేధింపులను, ఇంగ్లీష్‌లో సెక్సువల్ హెరాస్మెంట్ అని అంటారు. కన్నార్పకుండా చూడడం, సైగలు చేయడం, తాకడం లేదా అసభ్య కరమైన వ్యాఖ్యానాలు చేయడం వంటి 'సెక్స్' పరమైన, అనుచితమైన ప్రవర్తనను లైంగిక వేధింపులు అని వ్యవహరించవచ్చు.

భారత రాజ్యాంగంలో అధికరణం 14, 15 ప్రకారం మహిళలకు పురుషులతో సమానంగా ప్రాథమిక హక్కులు కల్పించబడ్డాయి. అయితే వారిపై జరిగే లైంగిక వేధింపులు ఈ హక్కులను ఉల్లంఘిస్తున్నట్లే అని చట్టం గుర్తించింది. అలాగే ఆర్టికల్ 21 ప్రకారం ఎటువంటి వేధింపులు లేని, సురక్షితమైన వాతావరణంలో స్త్రీలు తమకు నచ్చిన వృత్తి లేక వ్యాపారం చేసుకునే హక్కు కల్పించబడింది. అయితే ఈ మధ్య కాలంలో ఆశ్చర్యరీతిగా పురుషులు కూడా లైంగిక వేధింపులకు గురికావడం ప్రస్తుత పతన స్థితిని కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తుంది. విచ్చలవిడి శృంగారం సోషల్ మీడియాను ముంచెత్తుతుంది.

ప్రభు రాకడ సమీపించే కొద్దీ అక్రమము విస్తరిస్తుందని చెప్పబడిన మాట నెరవేరుతుంది. అన్యాయస్తులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి; జారులైనను, విగ్రహారాధికులైనను, వ్యభిచారులైనను, ఆడంగితనముగలవారైనను, పురుష సంయోగులైనను, దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు (1 కొరింథీ 6:9,20). ప్రకటన గ్రంథం 21:8లో పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము అని రాయబడింది. కాబట్టి లైంగిక పరమైన ఇలాంటి అంశాలను మనం చేయకుండా, సమాజంలో జరగకుండా చూడాలి.

**ముగింపు**

దేవుడు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి పిలిచిన తర్వాత మన జీవితం వెలుగు సంబంధులుగానే ఉండాలి. మత్తయి 5:13-14లో 'మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును? అది బయట పారవేయబడి మనుష్యులచేత త్రొక్కబడుటకే గాని మరి దేనికిని పనికిరాదు. మీరు లోకమునకు వెలుగైయున్నారు; కొండమీద నుండు పట్టణము మరుగైయుండనేరదు" అని రాయబడి ఉంది. కాబట్టి మనం మన సమాజం కుళ్ళిపోకుండా చూడాలి. అంతేకాదు రుచికరంగా కూడా ఉంచాలి. అంధకారమైన లోకంలో క్రీస్తు వెలుగును ప్రసరింపచేయాలి. అలాంటి కృపను ప్రభువు మన అందరికిని అనుగ్రహించును గాక ఆమెన్ !

**- వి. రూజ్‌వెల్ట్‌బాబు,** గుంటూరు

ప్రత్యేకం



# సమకాలీన క్రైస్తవ దురాచారాలు



యోహాను సువార్త 17వ అధ్యాయంలోని తన ప్రధాన యాజక ప్రార్థనలో, మన ప్రభువైన యేసుక్రీస్తు సార్వత్రిక సంఘం గురించి ప్రత్యేకంగా కొన్ని సమస్యలపై దృష్టి సారించాడు. యేసు తనకు అప్పగించిన, నెరవేర్చిన పని గురించి, దేవుని మహిమ, నెరవేర్చబడిన దేవుని చిత్తం గురించి తండ్రికి ప్రార్థించడమే కాకుండా, “వారంతా ఏక మవులాగున” అని తన శిష్యుల కోసం ప్రార్థించాడు. ఆయన ప్రార్థనలోని ఏకైక సారాంశం, భూమిపై యేసు స్థాపించిన రాజ్యం, కొత్త సమాజం ముందు ఉన్న ఈ అంతర్లీన సవాలు గురించే.

ఐక్యత అంత కీలకమైనదా, సంక్లిష్టమైనదా? దేవుని ఇంటిలో, తన గొర్రెల మధ్య ఐక్యత ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలంటే ఈ భూమి పై సంఘం పట్ల దేవుని దర్శనాన్ని అర్థం చేసుకోవడం కీలకం.

చాలా సార్లు, నేను ఇలా అనుకుంటాను... “యేసు నన్ను పరలోకం కోసమే రక్షించినట్లయితే నేను ఇంకా భూమిపై ఎందుకు ఉన్నాను? నా తండ్రి నన్ను రక్షించిన వెంటనే నేను పరలోకానికి ఎందుకు వెళ్ళలేదు? ప్రతి క్రైస్తవుడు తనని తాను ఈ ప్రశ్న వేసుకోవాలని నేను కోరుకుంటున్నాను.

నేడు సంఘాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, ముఖ్యంగా భారతదేశంలో, దేవుని రాజ్యం యొక్క మొత్తం భావన, పునాది, ఉనికికి హాని కలిగించే కొన్ని భయంకరమైన పోకడలు కనిపిస్తున్నాయి.

అలాంటప్పుడు, మనం ఎక్కడ ప్రారంభించాలి? సరే, ప్రారంభంలోనే ప్రారంభిద్దాం.

పాత నిబంధనలో బయలుపర్చబడిన దేవుని మనస్సులో సంఘాన్ని గూర్చిన రెండు ముఖ్యమైన అంశాలు చూద్దాం.

సంఘం అనేది యేసు పునరుత్థానం తర్వాత పుట్టిన ఆలోచన కాదు. పాతనిబంధనలో, ఆదిమ పితరుల కాలం నుండే సంఘ చిత్రాన్ని చూస్తాము.

**అబ్రాహాము** – దేవుడు అబ్రాహామును పిలిచినప్పుడు (ఆదికాండము 12:3), ‘నేను నిన్ను ఆశీర్వదించి సముద్రపు ఒడ్డున ఇసుక రేణువుల్లా విస్తరింప చేస్తాను’ అని చెప్పాడు. దేవుడు చెప్పింది అబ్రాహాముకు అర్థమైందని మీరు అనుకుంటున్నారా? అసాధ్యం! అయితే అప్పుడు దేవుడు ఎందుకు అలా చెప్పాడు? అబ్రాహాముతో మాట్లాడుతున్నప్పుడు దేవుడు ఏమి చూశాడు? బహుశా, అబ్రాహాము కళ్ళలోకి చూస్తూ, దేవుడు నావైపు చూస్తున్నాడు. ‘నేను నీతో చేస్తున్న వాగ్దానం ద్వారా సుదూర దేశంలో, వేల సంవత్సరాల తర్వాత మారుమూల ప్రాంతంలో ఉన్న జాన్ క్రిస్టోఫర్ నా కుమారుడుగా మారబోతున్నాడు!’ అన్నాడేమో కదూ! అలా దేవుడు నిన్ను, నన్ను చూశాడు. ఎందుకంటే ఆ వాగ్దానం మీలో, నాలో కూడా నెరవేరింది. అదే సార్వత్రిక సంఘం!

ఆదిమ సంఘంలో, వివాదాలు తలెత్తినప్పుడు, వారు అందరూ కలిసి విశ్వాస ప్రకటనలు చేశారు. కానీ నేడు, పవిత్ర గ్రంథాన్ని గౌరవప్రదంగా పరిశీలించడానికి బదులుగా, సంఘం ప్రపంచవ్యాప్తంగా నలభై ఐదు వేల శాఖలుగా విభజించబడింది. కొన్ని జాతి, సంస్కృతి, సాంప్రదాయాల ఆధారంగా ఏర్పడ్డాయి. అందుకే పౌలు 'క్రీస్తు విభజించబడ్డాడా?' అని రోదించాడు (1 కొరింథీ 1:13) నేటి సంఘం పౌలు యొక్క మొరను అర్థం చేసుకుంటుందా?

**మోషే** – దేవుడు తన ప్రజలను ఐగుప్తు బానిసత్వం నుండి బయటకు తీసుకొని రావడానికి మోషేను పిలిచినప్పుడు, దేవుడు తనతో ఉన్నాడని నిరూపించడానికి మోషేకు ఇచ్చిన సంకేతం ఏంటి? ఆశ్చర్యకరంగా, పది తెగుళ్ళు లేదా సముద్రం విడిపోవడం వంటి గొప్ప అద్భుతాలు కాదు. కానీ, నిర్గమ 3:12లో, "మరియు దేవుడు, 'నేను నీతో ఉంటాను. నిన్ను పంపింది నేనే అనడానికి ఇదే సూచన, మీరు ఐగుప్తు నుండి ప్రజలను రప్పించిన తర్వాత, మీరు ఈ పర్వతం మీద దేవుణ్ణి ఆరాధిస్తారు" అని చెప్పాడు. ఆరాధించే సంఘం!

పాత నిబంధన అంతా, పరలోకపు తండ్రి, ఎంపిక చేయబడిన సంఘానికి, వాగ్దానం చేయబడిన కుటుంబానికి, ప్రవచించబడిన దేవుని రాజ్యానికి తండ్రిగా ఉండడానికి కోరుకున్నాడు!

అయ్యో! ఈ దేవుని దర్శనం నుండి మనం ఎంత దూరం వెళ్ళామో కదూ!

ఈ రోజు దేవుని కుటుంబం, దేవుని మంద, దేవుని రాజ్యం, దేవుని సంఘం, క్రీస్తు శరీరం, దేవుని ఇల్లు, దేవుని భవనం విపరీతమైన సమస్యలు లోపల నుండే ఎదుర్కొంటుంది.

ఆధునిక సంఘం దేవుని సంఘాన్ని విచ్ఛిన్నం చేసే పోకడలతో బాధింపబడుతుంది. అందుకే యేసు ఐక్యత కోసం ప్రార్థించాడు.

సమస్యలు చర్చికే పరిమితం కాదు. ఇయు, ఇజియఫ్‌లో కూడా ఉంటున్నాయి. వాస్తవానికి, సమస్యలు మనలో అంత ప్రబలంగా లేవు. అయినప్పటికీ, మనం కలుపు మొక్కలను ఏరి వేయకపోతే, పతనానికి ఎంతో దూరంలో లేము! అయితే మనం క్రైస్తవ్యంలోని సమకాలీన దురాచారాలను గూర్చి ఆలోచించాలి.

## సమకాలీన క్రైస్తవ దురాచారాలు

### సెలెబ్రిటీ కల్చర్

ఒకరిని అనుసరించాలనే కోరిక మానవుని ధోరణి.



మనమందరం మంచి ఆదర్శనీయమైన హీరోలను ఎంచుకొని అనుకరించడానికి ప్రయత్నిస్తాము. ప్రేరణ కోసం ఇది తప్పు కాకపోవచ్చు. కానీ ఈ పదం చెప్పినట్లు, సెలబ్రిటీ కల్చర్‌లో మనం దేనిని సెలబ్రేట్ చేసుకొంటున్నాము? మన కల్చర్ ఎలా మారుతుంది? అనే దాన్ని గూర్చి మాట్లాడుతుంది. అంటే ఒక వ్యక్తిని పూజించే మనస్తత్వంతో అనుసరించడం ఖచ్చితంగా ప్రమాదకరం. ముఖ్యంగా ఆధ్యాత్మిక జీవితం విషయానికి వస్తే ఇది విగ్రహారాధనకు మొదటి మెట్టు. దేవునికి, ఆయన వాక్యానికి బదులుగా మరొక వ్యక్తిని అనుకరించడం భౌతిక, ఆలోచనా పరమైన బానిసత్వానికి నాంది పలుకుతుంది. ఇది ఒకరి జీవితంలో ప్రాధాన్యతలను, ఆధ్యాత్మిక జీవన విలువలను కూడా మారుస్తుంది.

కబీర్ వ్రాసిన దోహా (పద్యం) లాగా,

**गुरु गोबिंद दोनों खड़े काके लागू पाय**

**बलिहारी गुरु आपनो, गोबिंद दियो बताय**

అర్థం: నా దారిలో భగవంతుడు, గురువు ఇద్దరూ ఎదురైతే, భగవంతుడిని ఎక్కడ వెతకాలో నాకు చూపించింది గురువు కాబట్టి నేను మొదట ఆ గురువుకే నమస్కరిస్తాను.

అలాంటి సంస్కృతి నేడు చర్చిలో ప్రాకుతుంది. దేవుని ప్రజల జీవితం, ప్రవర్తన, విశ్వసించే విధానం ఇలా మారింది. ఎంత విషాదం! క్రీస్తు ఒక్కడే మన హీరో అయి ఉండాలి. క్రీస్తు మాత్రమే, బైబిల్ మాత్రమే మన అత్యంత ప్రాధాన్యతగా ఉండాలి!

సంఘంలో అంతర్గత తగాదాల గురించి యుఇయస్ఐ మొదటి కోశాధికారి, ఒక సమావేశంలో నిజమైన సంఘటనను వివరించారు. ఒక చర్చి నుండి రెండు సమూహాలు తమ వివాదాలను పరిష్కరించుకోవడానికి కోర్టుకు వెళ్ళినప్పుడు, క్రైస్తవేతర న్యాయమూర్తి రెండు సమూహాలను మీరు తిరిగి వెళ్లి కొండమీది ప్రసంగాన్ని అధ్యయనం చేసి, తదుపరి విచారణకు ఒక నెలలోపు రావాలని ఆదేశించారు. ఆశ్చర్యకరంగా నెల రోజుల తర్వాత ఇరువర్గాలు కోర్టుకు వచ్చారు. అయితే అప్పటికే వారు సమాధాన పడి వచ్చారు. ఎంత గొప్ప పాఠం! క్రైస్తవులందరూ ఈ సూత్రాన్ని నేర్చుకుంటే చాలు.

## డినామినేషన్స్ విభజనలు

ముందు చెప్పినట్లుగా, యేసు ప్రార్థన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన పిల్లల ఐక్యతపై దృష్టి పెడుతుంది. అయ్యో! ఈ విషయం ఎలా మిస్సయ్యాము? సిద్ధాంతాలు, ఆచారాల పేరుతో మనం సాతాను ఉచ్చులలో చిక్కుకున్నాము.

మనం యేసు ప్రార్థన మరచి పోవడమే కాదు, పరిశుద్ధాత్ముని కార్యానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నామేమో! ఎఫెసీ 4:1 ప్రకారం, మన భిన్నత్వాలలో ఏకత్వాన్ని తెచ్చేది పరిశుద్ధాత్ముడే. కాబట్టి దేవుని ఇంటిలో ఐక్యతకు ఆటంకం కలిగించే ఏ ఒక్క అడుగు అయినా పరిశుద్ధాత్ముని పనికి వ్యతిరేకంగా చేస్తున్నట్లే.

ఈ డినామినేషనల్ విభజనలకు ఒక కారణం లేఖనాలను అర్థం చేసుకోలేకపోవడం. నిజమే, వేర్వేరు వ్యక్తులు లేఖనాలను వేర్వేరుగా అర్థం చేసుకుంటారు. అయితే, విభజన మంచిదేనా? ఆదిమ సంఘంలో, వివాదాలు తలెత్తినప్పుడు, వారు అందరూ కలిసి విశ్వాస ప్రకటనలు చేశారు. కానీ నేడు, పవిత్ర గ్రంథాన్ని గౌరవప్రదంగా పరిశీలించడానికి బదులుగా, సంఘం ప్రపంచవ్యాప్తంగా నలభై ఐదు వేల శాఖలుగా విభజించబడింది. కొన్ని జాతి, సంస్కృతి, సాంప్రదాయాల ఆధారంగా ఏర్పడ్డాయి. అందుకే పౌలు 'క్రీస్తు విభజించబడ్డాడా?' అని రోదించాడు (1 కొరింథీ 1:13) నేటి సంఘం పౌలు యొక్క మొరను అర్థం చేసుకుంటుందా?



## రాజకీయ అనుబంధాలు

ఈ రోజుల్లో, ముఖ్యంగా భారతీయ చర్చిలో రాజకీయ అనుబంధాలు మరొక ముప్పు. చర్చిలో నాయకుడు తమ విధేయతలను, అనుబంధాలను మందపై బలవంతంగా రుద్దుతాడు. మొదట, ఇది చర్చి, సొసైటీ మధ్య ఉన్న సంబంధాన్ని కూల్చివేస్తుంది. కాబట్టి ఇది లేఖన విరుద్ధం. వాక్య ప్రకారం, క్షీణిస్తున్న సమాజంలో వెలుగుగా, ఉప్పులా పని చేయడానికి భూమిపై ఉన్న ఏకైక సంస్థ సంఘం. మార్పు కు ఏజెంట్‌గా జీవించే బదులు, రాజకీయ అనుబంధాలు చర్చిని పక్షపాతిగా మారుస్తాయి. కారణం... రాజకీయ పార్టీలకు వారి స్వంత ఎజెండాలు ఉండడమే. వారి రహస్య ఎజెండాలు, భావజాలాలలోకి వెళ్ళడమంటే ప్రమాదకరమైన ఊబిలోకి వెళ్తున్నట్లే. ఇది లేఖన విరుద్ధమే కాదు, అనైతికం కూడా.

సరే, కారణం ఏదైనా కావచ్చు, ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన పార్టీని ఎంచుకునే హక్కు ఉంటుంది. ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ సిద్ధాంతం, ఎజెండాకు కట్టుబడి ఉంటాడో లేదో నిర్ణయించుకోవాల్సింది వ్యక్తి. కానీ సంఘం, సంఘ నాయకులు 'ఒక పార్టీకి మద్దతు ఇవ్వమని బలవంతం చేసినప్పుడు, ఆ నాయకత్వం వ్యక్తుల ప్రాథమిక హక్కులు కాలరాస్తున్నట్లే. ఇది వ్యక్తిగత ఎంపికలు, మానవ హక్కులపై దాడి చేయడం వంటిదే.

## గ్రూపిజం

గజిబిజియైన ప్రాధాన్యతల వింత దృశ్యం! మనమందరం ఒకే తండ్రి పిల్లలమైతే, మనం సమూహాలుగా ఎలా విడిపోతాము? అంటే, మనం లేఖనాలకు కాకుండా వేరే వాటివైపు ఆకర్షితులవుతున్నాము. అది మనకు నచ్చిన వ్యక్తి కావచ్చు, సమాజ భావన కావచ్చు, సంస్కృతి, భాషా అనుబంధం కావచ్చు. క్రీస్తు రక్త బంధం కాక, మరేమీ మనలను ఏకం చేయలేవు. మరేదైనా కారణం వల్ల క్రీస్తు రక్తం ద్వారా ఏర్పడిన బంధం తెగిపోతే, మనం సాతాను చేతుల్లో బంధీలమయినట్లే.

స్పష్టంగా, ఇది సంఘం పట్ల దేవుని కలకి వ్యతిరేకం. మన సహవాసాల్లో కూడా ఇది తరచుగా

చూస్తాము. అందరూ అందరినీ ఇష్టపడడం తప్పనిసరి కాదు. కానీ, సంఘ ఉనికికి, మిషన్‌కి గొడ్డలి పెట్టు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న వ్యక్తుల స్వార్థ నిర్ణయాల ద్వారా సంఘం యొక్క అంతిమ లక్ష్యం రాజీపడిపోతుంది. కొన్నిసార్లు ఇది వ్యక్తిగత ఎజెండాల వల్ల, నాయకత్వ స్థానాలు, పరి పాలనపై నియంత్రణ కోసమైన కోరిక వల్ల వస్తుంది. ఇది కేవలం సాతానీయమైన మనస్తత్వం. ఇది క్యాన్సర్ లాంటిది. చర్చి లేదా ఫెలోషిప్ యొక్క మిషన్ కొంతమంది నాయకుల వలన నీరుగార్చబడడానికి దారి తీస్తుంది.

### కోర్టు కేసులు

సంఘంలో ఈ అంతర్గత తగాదాల గురించి మాట్లాడాల్సి రావడం సిగ్గుచేటు. యుఇయస్ఐ మొదటి కోశాధికారి, ఒక సమావేశంలో నిజమైన సంఘటనను వివరించారు. ఒక చర్చి నుండి రెండు సమూహాలు తమ వివాదాలను పరిష్కరించుకోవడానికి కోర్టుకు వెళ్ళినప్పుడు, క్రైస్తవేతర న్యాయమూర్తి రెండు సమూహాలను తిరిగి వెళ్లి కొండమీది ప్రసంగాన్ని అధ్యయనం చేసి, తదుపరి విచారణకు ఒక నెలలోపు రావాలని ఆదేశించారు. ఆశ్చర్యకరంగా నెల రోజుల తర్వాత ఇరువర్గాలు కోర్టుకు వచ్చారు. అయితే అప్పటికే వారు సమాధాన పడి వచ్చారు. ఎంత గొప్ప పాఠం! క్రైస్తవులందరూ ఈ సూత్రాన్ని నేర్చుకుంటే చాలు. కుటుంబంలో, ఫెలోషిప్‌లలో, చర్చిలలో వ్యక్తుల మధ్య వివాదాలు పెరుగుతున్నాయి. అంటే క్రీస్తు రక్తం, పరిశుద్ధాత్మ పని, పరిశుద్ధ బల్ల సంస్కారము, ఇవేవీ పనిచేయట్లేదా? దానికి కారణం మన మొండితనం కాదా? మనం ఒక సోదరుడిని ముఖాముఖిగా చూడలేకపోతే, మనం దేవుని ముఖాన్ని ఎలా వెతకగలం? ఎంతటి వేషధారణ?!

### ఆర్థిక మోసాలు

దశమభాగాలు, బహుమతులు నేడు చర్చిలో మరొక ముప్పుగా మారుతున్నాయి. ఒకవైపు ఇచ్చేవారు వ్యాపార ఆలోచనా ధోరణిని పెంచుకున్నారు. అనేక రెట్లు ప్రయోజనాలను పొందుతారని ఆశజూపి 'సీడ్ మని' అని సంఘాన్ని అడిగే బోధకులతో ప్రసంగ వేదికలు నిండి ఉన్నాయి. అంటే, 'నేను ఇస్తాను, తద్వారా నేను తిరిగి పొందుతాను'. ఇది దేవునితో బేరసారాలే గాని కానుక పెట్టె వద్ద దేవుని సంతోషపెట్టే హృదయం కాదు. మనం ఇచ్చేది తిరిగి పొందాలనే దురుద్దేశంతో కాదు, కానీ మనకు అర్హత లేని వాటిని ఇప్పటికే పొందాము కాబట్టి మనం ఇస్తాము.



బైబిల్ కృతజ్ఞతతో ఇవ్వడం, ఉల్లాసంగా ఇవ్వడం, స్థిరంగా ఇవ్వడం, ఉద్దేశ పూర్వకంగా ఇవ్వడం, త్యాగ పూరితంగా ఇవ్వడం గురించి మాట్లాడుతుంది.

మరోవైపు, అర్పించే దశమభాగాలు, అర్పణల గూర్చి చాలా చోట్ల లెక్కలు చూపించరు. అవి దుర్వినియోగం అవుతుంటాయి. నేడు, భారతీయ సంఘం, సంఘ పరిచర్యల కోసం ఆర్థికంగా సహాయపడగల సామర్థ్యం కలిగి ఉంది. అయితే వ్యక్తిగత రాజ్యాల కోసం వనరులను ఎలా దోచుకున్నారో గతం సాక్షిగా నిలుస్తుంది. ఈ రాజ్యాలు దేవుని రాజ్యం యొక్క మిషన్‌పై తమ నీడల ను అలుముకొనేటట్లు చేస్తున్నాయి. చివరికి, ఇది సంఘ ప్రయోజనాలను ఓడించేస్తుంది. తీర్పు రోజున మనం ఎంత అవమానకర పరిస్థితి ఎదుర్కోవలసి వస్తుందో దేవునికి మాత్రమే తెలుసు.

మన మాజీ నేషనల్ స్టాఫ్ సత్యకీర్తిరావు గారు ఒకసారి ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయం నాకు చాలా స్పష్టంగా గుర్తుంది. యుఇయస్ఐలో కొత్తగా ఒక కాన్ఫరెన్స్ సెంటర్ కోసం పరుపుల ను కొనడానికి ఒక గ్రాడ్యుయేట్ తగినంత డబ్బు ఇచ్చారంట. రెండేళ్ళు వేచిచూసి ఆరా తీయగా సదరు వ్యక్తులు పరుపులు కొనలేదు. మరో ఏడాది పాటు వేచి చూసినా పరిస్థితి అలాగే ఉంది. తర్వాత ఆరు నెలల్లో మీరు కొనకపోతే నా డబ్బు వడ్డీతో సహా తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని అల్టిమేటం ఇచ్చాడు ఆ గ్రాడ్యుయేట్. ఆరు నెలలు గడిచినా పరుపులు కొనలేదు. విషాదం ఏంటంటే, డబ్బు వడ్డీతో తిరిగి ఇచ్చారు. ఇది అందుబాటులో ఉన్న వనరులపై నేరపూరిత నిర్లక్ష్యం.

పైన పేర్కొన్న సమస్యలన్నీ దేవుని ఉద్దేశానికి, మిషన్‌కు తీవ్రమైన ముప్పులే. అవి అన్నీ సాతాను వ్యూహంలో వివిధ రూపాలు.

మిగిలినది వచ్చే సంచికలో...

**– జాన్ క్రిస్టోఫర్,** హైదరాబాద్



# విడాకులు

**విడాకులపై బైబిల్ దృక్పథం:**

విడాకులపై బైబిల్ దృక్పథానికి ఆధారము మోషే ధర్మశాస్త్రములో ఉన్నది. వివాహం యొక్క శాశ్వతత్వాన్ని, స్థిరత్వాన్ని, వివాహంలోని నీతిని, ధర్మాన్ని యేసుక్రీస్తు సువార్తల్లో నొక్కి చెప్పాడు (మత్తయి 19:7–9; మార్కు 10:2–12; లూకా 16:18).

| వివిధ సంఘశాఖలు | విడాకులపై వాటి నమ్మకాలు/అభిప్రాయాలు |
|---|---|
| క్యాథలిక్ సంఘము | విడాకులను నిషేధిస్తుంది. రద్దును అనుమతిస్తుంది. (కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో) |
| ఈస్ట్రన్ ఆర్థోడాక్స్ సంఘము | విడాకులను, పునర్ వివాహాలను అనుమతిస్తుంది. (కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో) |
| ప్రొటెస్టంట్ సంఘాలు | విడాకులను నిరుత్సాహపరుస్తుంది/త్రోసివేస్తుంది. ఏ మార్గము లేనప్పుడు మాత్రమే దీన్ని ప్రోత్సహిస్తుంది. విడాకులను పాపంగా పరిగణిస్తుంది (మలాకీ 2:16) |
| హిందూ/సిక్కు మతాలు | మరణం మాత్రమే వారిని విడదీస్తుంది. |

**విడాకులపై లోక దృక్పథం:**

*"వివాహం అనేది కాలంచెల్లిన వ్యవస్థ"* – మల్లికా సారాబాయ్, క్లాసికల్ డాన్సర్, సామాజిక కార్యకర్త

*"వివాహం అనేది జీన్స్‌ప్యాంట్ మార్చుకోవడం లాంటిది"* – పూజా బేడీ, బాలీవుడ్ నటి

*"విడాకులు పెరగడం ఒక మంచి సూచన"* – నిషిత్ మెహత, సైకాలజిస్ట్

ఈ మధ్యకాలం వరకు సామాజికంగా, సాంప్రదాయపరంగా విడాకులకు ఏమాత్రం ఆమోదం లేదు, ముఖ్యంగా స్త్రీలు విడాకులను కోరిన సందర్భంలో, నిజానికి, తన భర్త ఎంత క్రూరుడైనప్పటికీ, హింసకుడైనప్పటికీ తనతోనే జీవించమని భార్య తల్లిదండ్రులే ఆమెను ప్రోత్సహించేవారు. ముస్లింలు, ఆంగ్లేయుల పాలన భారతదేశంలో ప్రారంభమైనప్పటి నుండి "తలాక్", విడాకుల సాంప్రదాయాలు మన దేశంలో ప్రారంభమయ్యాయి. ప్రపంచీకరణ కారణంగా గడచిన రెండు దశాబ్దాల కాలంలో విడాకుల సంఖ్య భారతదేశంలో పెరిగి పోయింది. వివాహం అనేది ఒక కాలం చెల్లిన వ్యవస్థగా భావించే రోజులు వచ్చాయి. భారతదేంలో 50% కంటే ఎక్కువమంది ప్రజలు ఒంటరిగా జీవించడానికి లేదా అక్రమ సంబంధాల వ్యవస్థలో భాగంగా ఉండడానికి ఇష్టపడుతున్నారు.

## విడాకులను నిరోధించడం ఎలా?

విడాకులను నిరోధించాలంటే వివాహం పట్ల దేవుని దృక్పథమును అలవరచుకోవాలి. అన్ని పాపాలలాగే విడాకులు మనస్సులో ప్రారంభమై, ఒక వరద ప్రవాహంలా సంఘములోనికి కూడా వచ్చేసింది.

నీవు వివాహం చేసుకొంటే, వైవాహిక జీవితంలో కొన్ని ఇబ్బందులు రాక తప్పదు. "నా వైవాహిక జీవితంలో ఎలాంటి సమస్యలు లేవు" అని నీవు అనుకొంటే, నీవు వాస్తవ పరిస్థితిని ఇంకా గుర్తించలేదన్నమాట. వివిధ నేపథ్యాలు, వివిధ ఆలోచనా విధానాలు ఉన్న ఇద్దరు వ్యక్తులు వివాహ సంబంధంలో ఏకమౌతారు కాబట్టి సమస్యలు ఖచ్చితంగా వస్తాయి. "కావున నీవు బలిపీఠము నొద్ద అర్పణము నర్పించుచుండగా నీ మీద నీ సహోదరునికి విరోధమేమైనను కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చినయెడల అక్కడ బలిపీఠము నెదుటనే నీ యర్పణము విడిచిపెట్టి, మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానపడుము. అటు తర్వాత వచ్చి నీ యర్పణము నర్పింపుము" (మత్తయి 5:23-24) అని యేసుక్రీస్తు చెప్పారు. ఇదే సూత్రాన్ని పేతురు వివాహానికి అన్వయిస్తూ ఇలా చెప్పాడు "అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి... జ్ఞానముచొప్పున వారితో కాపురము చేయుడి" (1 పేతురు 3:7). కాబట్టి మీ ప్రార్థనలకు జవాబు రావడం లేదంటే దానికి కారణం ఏంటో మలాకీ, పేతురు ఇలా తెలియజేస్తున్నారు, "నీ భార్య/నీ భర్తతో నీవు ఎలా ప్రవర్తిస్తున్నావు?" "దేవునికి, నాకు మధ్య సంబంధం బాగానే ఉన్నది, గానీ నా భార్య/భర్తతోనే నాకు సమస్య ఉన్నది" అని నీవు అనవచ్చు. కాని దేవుడు ఏమంటున్నాడంటే, "నీకు నాకు మధ్య సంబంధం ఏమీ బాగోలేదు, ముందు నీవు వెళ్ళి నీ భార్య/భర్తతో సరిచేసుకొనిరా".

మోషే విడాకులను ఎందుకు అనుమతించాడు అని పరిసయ్యులు (వీరికి కూడా విడాకుల పట్ల తప్పుడు అభిప్రాయమే ఉన్నది) యేసుక్రీస్తును అడిగినప్పుడు, ఆయన ఇలా సమాధానం చెప్పారు "మీ హృదయకాఠిన్యమును బట్టి మీ భార్యలను విడనాడ మోషే సెలవిచ్చెను గాని ఆది నుండి ఆలాగు జరగలేదు" (మత్తయి 19:8). విడాకులు తెలియజేసేది ఏంటంటే, ఇద్దరిలో దాదాపు అన్నిసార్లు ఇద్దరూ కఠిన హృదయులు అయ్యారు. మోషే విడాకులకు అనుమతి ఇవ్వడానికీ (ద్వితీ 24:1-4), దేవుడు విడాకులను అసహ్యించుకోవడానికీ (మలాకీ 2:16) మధ్య వివాదానికి తావులేదు. పశ్చాత్తాపం చెందకుండా లైంగిక అపవిత్రతలో ఉన్న సందర్భంలో (మత్తయి 5:32; 19:9; ద్వితీ 24:1; యిర్మీయా 3:6-10), ఒక అవిశ్వాసి విశ్వాసిని వదలివేసిన సందర్భంలో (1 కొరింథీ 7:10-16) బైబిల్ విడాకులకు అనుమతి ఇస్తుంది (ఖచ్చితంగా తీసుకోవాలని మాత్రం చెప్పదు) అని నాకు అర్థమైంది. అయితే, దేవుడు మాత్రం విడాకులను అసహ్యించుకుంటున్నాడు. విడాకులు ఆయనను మహిమపరచవు. వాటి మూలంగా ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు అన్యాయం జరుగుతుంది. లైంగిక అపవిత్రతలో సైతం, నిజమైన పశ్చాత్తాపం, క్షమాపణ ద్వారానే దేవునికి మహిమ వస్తుంది గాని విడాకుల ద్వారా కాదు.

మలాకీ 2:16లో మాత్రమే దేవుడు "ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా" అని పిలువబడ్డాడు. దేవుడు విడాకులను అసహ్యించుకొంటున్నాడు అని తెలియజేసే సందర్భంలో దేవునికి ఆ బిరుదు వాడబడింది. తన భార్య ఇశ్రాయేలుతో దేవుడు చేసిన ప్రేమ నిబంధనకు విడాకులు మాయనిమచ్చలా ఉంటాయి (యెషయా 54:5-8). క్రొత్తనిబంధన సందర్భంలో సంఘము పెండ్లికుమార్తె క్రీస్తు భర్త. క్రీస్తు సంఘమును ప్రేమించి దాని కొరకు తనను తాను ఎలాగు అర్పించుకొన్నాడో, ఆవిధంగా భర్తలు తమ భార్యలను ప్రేమించాలని క్రొత్తనిబంధన తెలియజేస్తుంది (ఎఫెసీ 5:25-33). తాను ఏర్పరచుకొన్న పెండ్లి కుమార్తెయైన సంఘము పట్ల క్రీస్తు చూపిన ప్రేమ నిబంధనను క్రైస్తవ వివాహాలు ప్రతిబింబించాలి. ఒక క్రైస్తవ భర్త తన భార్యపట్ల నమ్మకత్వంతో చూపించే ప్రేమను చూసి, తన నిబంధనా సంబంధంలోని తన ప్రజల పట్ల దేవుడు చూపే ప్రేమను లోకం గుర్తిస్తుంది. దేవుని గొప్ప ప్రేమను అత్యవసరంగా తెలుసుకోవాల్సిన లోకం ముందు మన సాక్ష్యాన్ని విడాకులు బద్దలు చేస్తాయి.

కాబట్టి, విడాకులను నిరోధించాలంటే, వివాహం పట్ల దేవుని దృక్పథమును అలవరచుకోవాలి. ఈ లోక దృక్పథాలలో కొట్టుకొని పోకండి. దేవుని వాక్యసత్యాల నుండి మార్గదర్శకత్వాన్ని పొందండి.!

– **జె.యస్.ఎ. జూలియస్,** బెంగుళూరు



# గృహహింస

సమాజంలో ఉన్న దురాచారాలు సమాజాన్ని పట్టి పీడిస్తుంటాయి. ముఖ్యంగా మన దేశంలో ఎన్నెన్నో దురాచారాలు సమాజాన్ని కుదిపివేశాయి. భర్త చనిపోయినప్పుడు అతని శవంతో బ్రతికి ఉన్న భార్యను సజీవంగా దహనం చేయడం, కొన్ని గ్రామాల్లో యౌవ్వన స్త్రీలను దేవాలయానికి దేవదాసీలుగా సమర్పిస్తే, వీరు దేవదాసీలుగా ఎంతోమంది పురుషులకు లైంగిక కోరికలు తీరుస్తూ వేశ్యా జీవితం జీవించడం లాంటి దురాచారాలు మన దేశంలో వందల సంవత్సరాలుగా కొనసాగాయి.

దేవదాసీల గురించి దిగ్భ్రాంతి చెందేటటువంటి విషయాలు ఉన్నాయి. 2015లో జోగినీ కమీషన్ ఇచ్చిన సర్వే ప్రకారం ఇంకా మన దేశంలో సుమారు 4కోట్ల మంది జోగినీ కుటుంబాలు ఉండగా కేవలం మన తెలుగు రాష్ట్రాలలోనే సుమారు 90వేల మంది జోగినీలు వున్నట్లు తేలింది. 90% షెడ్యూల్ కులాలకి చెందిన బాలికలను స్థానిక దేవాలయానికి కట్టుబానిసలుగా మారుస్తారు. దేవదాసీలను కొన్ని ప్రాంతాల్లో జోగినీలు అంటారు.

ఇప్పటికైనా మన ప్రభుత్వాలు ఈ వ్యవస్థలోని స్త్రీలను రక్షించి వారిని విద్యావంతులుగా చేయడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని ఆ రొంపి నుంచి కాపాడాలని ప్రార్థిద్దాం.

## గృహహింస అంటే?

నేటి కాలంలో జరుగుచున్న మరొక దురాచారం గృహ హింస. గృహాలలో భర్తలు తమ భార్యలను హింసించడం. భర్తలను హింసించే భార్యలు కూడా ఉన్నారు. ఈ హింస ఎందుకు జరుగుతుంది? చాలినంత కట్నము తేలేదని భర్తలు తమ భార్యలను వేధించడం, కొన్ని సందర్భాల్లో చంపివేయడం జరుగుతుంది.

నాలుగు గోడలమధ్య, గృహాలలో ఎందరో మహిళలు హింసపొందుతూ భౌతిక, మానసిక వ్యధకు గురవుతూ, ప్రాణాలు కోల్పోతున్నారు. 'యునైటెడ్ నేషన్ పాపులేషన్ ఫండ్' రిపోర్ట్ ప్రకారం 65% మంది వివాహిత స్త్రీలు ఈ గృహహింసను అనుభవిస్తున్నట్లు, 15 సంవత్సరాల నుంచి 49 సంవత్సరాల మధ్యగల వివాహితుల్లో 70% మంది దెబ్బలు, బలాత్కారం, బలవంతపు లైంగిక చర్యల (వివాహంలో) వల్ల ఈ హింసను ఎదుర్కొంటున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ గృహ హింస కేవలం గ్రామ ప్రాంతాలకే పరిమితం కాదు, పట్టణాలలో, నగరాలలో కూడా ఇది విశృంఖలంగా వ్యాపించింది. ఇది కుటుంబ సంబంధీకులకు అనగా, భార్యకు గానీ, కుమారునికి గానీ, కుమార్తెకు గానీ, వృద్ధులైన అత్తమామలకు గానీ జరగవచ్చు. పురుషునికి గానీ, స్త్రీకి గానీ వ్యతిరేకంగా జరిగే హింస.

**గృహము దేవుని వ్యవస్థ. కుటుంబంలో దైవిక ప్రేమ లేనప్పుడు అది ఒక నరకప్రాయంగా ఉంటుంది. నిజమైన ప్రేమలో ఇవ్వడం, సహించడం, క్షమించడం ఉండి, తాను ప్రేమించే వ్యక్తి అత్యధిక మేలు కోరుతుంది (1 యోహాను 4:9). అవిశ్వాసుల కుటుంబాల్లో గృహహింస చాలా తీవ్రస్థాయిలో ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు. కానీ ఒక గ్రాడ్యుయేట్ కుటుంబంలో గృహహింస ఉంటే ఆ కుటుంబాన్ని ఎలా చూడాలి?**

## గృహ హింసకు కారణాలు

### ఎ. భార్యాభర్తలు ఒకరినొకరు మోసం చేసుకోవడం

ఒకరినొకరు మోసం చేసుకోవడం వల్ల కొన్ని కుటుంబాలలో భార్యాభర్తలు ఎప్పుడూ కలహిస్తూనే ఉంటారు. వారి మధ్య యుద్ధాలు జరుగుతుంటాయి. ఒకరి మీద మరొకరు అరుచుకొంటారు, కేకలు వేసుకొంటారు. భార్యాభర్తలు ఒకరితో మరొకరు అబద్ధాలు ఆడతారు. ఇలాంటి కుటుంబాలలో పెరిగిన పిల్లలు సమాజానికి ఎంతో కీడు చేస్తారు. వీరి వలన సమాజంలో విలువలు పడిపోతాయి. మనుష్యులలో ఈర్ష్య, పగ, ద్వేషము అంతకంతకూ పెరిగిపోతాయి.

### బి. కుటుంబంలో దైవిక విలువలు లోపించడం

కుటుంబం అనేది ప్రేమకు, ఆప్యాయతకు, ఆదరణకు నిలయమై ఉండాలి. కుటుంబములోని కుమారులు, కుమార్తెలు ప్రేమలోను, పరిశుద్ధతలోను ఎదిగి సమాజానికి ప్రేమను, పరిశుద్ధతను, నీతిని అందించాలి. నీతి నియమములు కుటుంబంలో ఉన్నప్పుడు పిల్లలు పరిశుద్ధతలో, క్రమశిక్షణలో ఎదుగుతూ సమాజాన్ని ప్రభావితం చేస్తారు. లేకపోతే లోకంలోని అనేక ఆశలు, అలవాట్లు, ఆలోచనలు కుటుంబాల్లోకి చొచ్చి నెమ్మది లేకుండా చేస్తాయి.

### సి. ధనాశ

కొంతమంది త్వరగా ధనం సంపాదించాలనే కోరిక కలిగి ఉంటారు. ధనము కలిగి ఉంటే అందరి కంటే తాము గొప్పవారం అని అనుకొంటారు. ఇది వీరి యొక్క ఆశ, గురి. అలాంటి వారు కష్టపడి సంపాదించడానికి బదులు ఎవరు ఎక్కువ కట్నం ఇస్తారా? అని వెదుకుతూ ఉంటారు. అనుకున్నంత కట్నము రాకపోతే భార్యను హింసించడానికి, చంపడానికి కూడా వెనుకాడరు. అదే విధంగా స్త్రీలలో ధనాశ ఉండడం వలన తమ భర్తకు రావాల్సిన ఆస్థి వెంటనే భర్తపేర రాయించాలని తొందర చేస్తారు. తమ భర్తలకు ఆస్థిలో రావాల్సిన భాగము వెంటనే



ఇవ్వాలని గొడవ చేస్తారు. దీనికి కారణం ధనాశే. లోకములో బతకడానికి ధనం కావాలి. అయితే ధనమును కష్టపడి పని చేసి సంపాదించాలే గాని తమ తల్లిదండ్రుల కష్టార్జితమును తీసుకోవాలని ఆరాటపడతారు. భార్యాభర్తలకు ధనాశ ఉన్నప్పుడు ఇంటిలో నెమ్మది ఉండదు. 'ధనాశ' అనే వ్యసనం సంపాదించే కొద్దీ అధికం అవుతుంది. దీని వలన మనుష్యుల మధ్యలో సంబంధాలు తెగిపోతాయి. అందుకే దేవుని వాక్యంలో ధనాపేక్షలేని వారై మీకు కలిగిన వాటితో తృప్తిపొందియుండుడి (హెబ్రీ 13:5) అని రాయబడింది.

### డి. ప్రేమ వ్యవహారాలు

కుటుంబంలోని హింసకు మరొక కారణం ప్రేమ వ్యవహారాలు. క్రైస్తవ విద్యార్థుల మధ్య కూడా ప్రేమ వ్యవహారాలు జరుగుచున్నవి. ప్రతి ప్రేమ వ్యవహారము మోహపు చూపుతో ఆరంభమవుతుంది. ఈ సమాజం దృష్టిలో మోహపుచూపు పాపము కాకపోవచ్చు గానీ దేవుని దృష్టిలో అది వ్యభిచారము. ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు

అప్పుడే తన హృదయమందు వ్యభిచారం చేసినవాడు (మత్తయి 5:28). వేటిని అయితే ప్రేమ వ్యవహారాలు అని మనం పిలుస్తున్నామో అవి దేవుని దృష్టికి వ్యభిచార వ్యవహారాలు. అందువలన ఈ విషయంలో ఎవరైనా ఇలాంటి వ్యవహారాల్లో ఉంటే వారి ని సరిదిద్దాలి, మందలించాలి, గద్దించాలి, బుద్ధి చెప్పాలి. గద్దింపుకు లోబడి సరిచేసుకోకపోతే ఇయు నుంచి బహిష్కరించాలి. లేని పక్షంలో మన ఇయు సహవాసాలన్ని దేవునికి దూరమవుతాయి. పాపానికి అపవిత్రత నిలయమైపోతాయి. కొంతమంది ప్రేమ వ్యవహారాలలో జీవించి మరొకరిని పెళ్ళి చేసుకొంటారు. తద్వారా గృహాల్లో హింస జరుగుతుంది. ప్రేమ వ్యవహారాల్లో జీవించినవారు పెళ్ళి చేసుకొన్నప్పటికీ పెళ్ళి అయిన తర్వాత ఒకరి మీద ఒకరు అనుమానం, అసంతృప్తి కలిగి ఉంటారు. నీతి నియమాలు కోల్పోయి పోట్లాడుకొంటారు. మధ్యలో పిల్లలు బలైపోతారు. కుటుంబములో సంతోషము, సమాధానం నిండి ఉండాలంటే మన ఇయు సహవాసాలలో ప్రేమ వ్యవహారాలను ఎంతమాత్రం అనుమతించకూడదు.

### ఇ. అనైతిక, అక్రమ సంబంధాలు

వివాహ సమయంలో 'ఎవ్వరినీ ఆశింపక, ఈమె/ ఈయనతోనే కాపురము చేస్తాను' అని దేవునితో వధూవరులు ప్రమాణం చేస్తారు. వారు వివాహ సమయంలో దేవునికి చేసిన ప్రమాణములను మరలా మరలా జ్ఞాపకం చేసుకొంటూ దేవునికి తమ్మును తాము సమర్పించుకొంటూ ఉండాలి. అప్పుడు కృపగల దేవుడు మనము శోధనలో పడకుండా కాపాడుతాడు. దేవుని కృప వలన పరిశుద్ధంగా జీవించే దంపతులు ఎంతోమందికి ఆశీర్వాద కారణంగా ఉంటారు. వారి గృహము దేవుని సేవకు తెరవబడి అనేకులు రక్షణ పొందడానికి కారణం అవుతుంది. కొంతమంది వివాహము అయిన తర్వాత పరస్త్రీలను ఆశించడం వలన గృహాలలో గొడవలు, హింస జరుగుతాయి. మన గృహాలలో గృహ హింస జరగకుండా ఉండాలంటే దంపతులు ఇద్దరూ దేవునికి భయపడి పరిశుద్ధంగా జీవించాలి. జారత్వానికి దూరంగా ఉండాలి. అప్పుడు మన హృదయంలో పరిశుద్ధాత్మ దేవుడు పరిపాలన చేస్తాడు. ఆత్మ నింపుదల కలిగి జీవిస్తాము.

## గృహహింస జరిగే విధానాలు

### ఎ. భౌతికంగా హాని చేయడం

హింసపొందే వ్యక్తిపై దాడిచేసి గాయం చేయడం, కర్రతో కొట్టడం, చేతులతో దాడి చేయడం, మెడ నులమడం, చెంపపై కొట్టడం, కత్తితో దాడి చేయడం. చాలా ఎక్కువగా భర్త భార్యను ఇలా హింసిస్తూ ఉండటం చూడవచ్చు.

### బి. లైంగిక హింస

బలవంతపు లైంగిక క్రియ, ఇష్టం లేకున్నా లైంగిక అవయవాల్ని తాకడం, కొన్నిసార్లు ఆడపిల్లలని తెలిసి బలవంతంగా అబార్షన్ చేయించడం, కుటుంబ నియంత్రణ అవసరమైనప్పుడు కూడా కండోమ్స్ వాడకుండా సెక్స్ చేయడానికి బలవంతం చేయడం వంటివి దీని క్రిందకి వస్తాయి.

### సి. భావోద్రేక, మానసిక హింస

భార్యపైన లేక భర్తపైన, బిడ్డలపైన భర్త/భార్య అసభ్య పదజాలంతో పెద్ద పెద్దగా అరవడం, భయపెట్టడం, దుర్భాషలాడటం, పిల్లలపై దుర్భాష ప్రయోగించడం, వారి ఫోన్ కాల్స్, వాట్సాప్‌పై నిఘా ఉంచడం, మాట్లాడకుండా ముభావంగా, కోపంగా చూడడం, సంజ్ఞలు చేయడం. ఈ విధంగా హింసకు గురైనవారు మానసికంగా కృంగిపోయి, ఒకవిధమైన భయంతో జీవిస్తారు. ఎప్పుడూ వారి ముఖాల్లో ఆందోళన కలిగి, లోలోపల చెప్పుకోలేని వేదన అనుభవిస్తారు.

### డి. ఆర్థిక హింస

ఇదిపైకి కనబడదు. భర్త తన భార్య ఉద్యోగం చేయడానికి ఒప్పుకోకపోవచ్చు. భార్యకు, ఇంటి ఖర్చులకు భర్త అవసరమైన ధనాన్ని ఇవ్వకుండా హింసించడం. ఇది భార్య పూర్తిగా భర్తమీద తన ఆర్థిక అవసరాలకు ఆధారపడినప్పుడు ఎక్కువగా జరుగుతుంది.

### ఇ. స్త్రీలకు వ్యతిరేకంగా జరిగే హింస

ఇది అన్నిటికంటే ఎక్కువగా జరిగే హింస. దీనికి ముఖ్యకారణం భారతదేశ సంస్కృతిలో స్త్రీకి ఉన్న స్థానమే. స్త్రీ, పురుషునికన్నా తక్కువ విలువ కలిగినదని, భౌతికంగా బలహీనురాలనే కారణంగా పురుషాధిక్య సమాజంలో స్త్రీ, పురుషులకు లోబడి ఒక బానిసలాగా బ్రతకాలనే భావన సమాజంలో



పాతుకుపోవటం వలన ఈ విధమైన ప్రవృత్తిని గమనించగలం. కట్నము ఒక ప్రధాన కారణం. మనుష్యులకు పురుషుడు ఒక విలువైన ధనాన్ని సంపాదించే వస్తువుగా ఎంచబడుతున్నాడు. ఎంత కట్నము ఇచ్చినా తృప్తిపొందని తల్లిదండ్రులు, పుట్టబోవు పిల్ల లేక పిల్లవాని లైంగికత పురుషునిపై ఆధారపడుతుందని తెలియని గ్రామీణ ప్రజలు, ఆడపిల్లను ప్రసవించినందుకు ఆమెను మానసికంగా హింసించడం మాత్రమేగాక, భౌతికంగా గాయపరచిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. భారతదేశంలో ఈ లింగ వివక్ష పిల్లల మనస్తత్వం మీద ఎంత ప్రభావం చూపిస్తుందో వివరించలేము.

### యఫ్. చిన్నపిల్లలు, వృద్ధులపై గృహహింస

మారు తల్లి, ఆల్కాహాలుకు బానిసైన తండ్రివలన చిన్నపిల్లలు మానసిక, భౌతిక హింసకు గురవుతున్నారు. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు, అత్తమామల బాధ్యత వహించేటప్పుడు వారిని ఒక భారంగా ఎంచి వారిని మానసికంగా కృంగదీయడం హింసగా గుర్తిస్తాము.

## గృహహింస గురించి దేవుని వాక్యం చెప్పే సత్యం

గృహము దేవుని వ్యవస్థ. కుటుంబంలో దైవిక ప్రేమలేనప్పుడు అది ఒక నరకప్రాయంగా ఉంటుంది. నిజమైన ప్రేమలో ఇవ్వడం, సహించడం, క్షమించడం ఉండి, తాను ప్రేమించే వ్యక్తి అత్యధిక మేలు కోరుతుంది (1 యోహాను 4:9). అవిశ్వాసుల కుటుంబాల్లో గృహహింస చాలా తీవ్రస్థాయిలో ఉంటుందనడంలో అతిశయోక్తిలేదు. కానీ ఒక గ్రాడ్యుయేట్ కుటుంబంలో గృహహింస ఉంటే ఆ కుటుంబాన్ని ఎలా చూడాలి? యుఇయస్ఐలో, సంఘాల్లో ఎంతో టీచింగ్ ఉండి కూడా భార్యలపై చేయిచేసుకునే భర్తలు, భర్తలకు కోపం రేపే భార్యలు ఉండడం శోచనీయం. మన ప్రభువు కాడిక్రిందకు రాకుండా సాత్వీకం, దీనత్వం భార్యాభర్తల్లో ఏవిధంగా చూడగలం? “నా యొద్ద నేర్చుకొనుడి” అన్న మన ప్రభువు బడిలో చేరి ఆయన ద్వారా మాత్రమే ఆ లక్షణాలను అభ్యాసం చేయాలి. భార్యాభర్తలు ప్రభువు ప్రేమతో నింపబడినప్పుడు ఆ గృహము ఒక చిన్న స్వర్గములా ఉంటుంది. చిన్న బిడ్డలు, పెద్దలు, ఆ ప్రేమ ప్రవాహంలో తృప్తిగా, నిర్భయంగా, ఆనందంగా జీవిస్తారు.

దేవుని వాక్యమును ఎరిగిన విశ్వాసులు ఎలా వీటిని నిర్మూలించాలో తప్పక ఆలోచించాలి. ప్రతి దురాచారానికి కారణం మనిషిలో ఉన్న పాపము. అయితే మనలోనున్న పాప నైజము మనలను ఏలుచున్నందున మనిషి ఎంత ప్రయత్నించినా దేవుని వాక్యమును అనుసరించి జీవించలేడు. మంచి చేయాలని మనిషి ఆశపడతాడు గానీ చెడు చేస్తూ ఉంటాడు. ఎందుకనగా మనిషిని నిత్యము పాపనియమము పరిపాలన చేస్తుంది (రోమా7:18-24). ఈ పాప నియమము నుంచి మనిషిని విడిపించువాడు ప్రభువైన యేసుక్రీస్తు. ఈయన తన శరీరమందు మన పాపమునకు శిక్షను అనుభవించి మనలను పాపము యొక్క అధికారము నుంచి విడుదల చేశాడు. ఆయన యందు విశ్వాసముంచినప్పుడు అనగా ఆయన సన్నిధిలో మన పాపములను ఒప్పుకొని పాపము నుండి ఈ దురాచారాలనుండి విడుదల కోరుకొన్నప్పుడు మనము ఈ లోకములో దేవుని కృపవలన పరిశుద్ధముగా జీవించగలము.

మన ఇయు, ఇజియఫ్‌లలో బైబిల్ స్టడీ ఎలా చేయాలో నేర్పిస్తున్నామే గానీ దేవుని వాక్యమును అనుసరిస్తూ, అనుదినం జీవించడం నేర్పించడం లేదు. కాబట్టి మన ఇయు విద్యార్థులు, ఇజియఫ్ సభ్యులు బైబిల్‌స్టడీ నడిపించడానికి, ప్రోగ్రామ్స్‌ని ఎంతో నైపుణ్యంగా చేయడానికి ఆరాటపడుతున్నారే గానీ దేవుని వాక్యమును అనుసరించి జీవించడానికి ఆశ కలిగి లేరు. మన కుటుంబాల్లో సమాధానం, సంతోషం ఉండాలంటే.. దేవుని వాక్యమును అనుసరించి జీవించడమే మన ధ్యేయమై ఉండాలి.

– **డా. పి. సిరాజ్,** ఇవాంజిలిస్ట్, విజయవాడ

బైబిల్ స్టడీ

# నులివెచ్చని స్థితి

(ప్రకటన 3:14-22)

ప్రకటన గ్రంథంలోని ఏడు సంఘాలకు రాసిన ఉత్తరాలలో లవొదికయ సంఘం చివరిది (ఎఫెసు, స్ముర్న, పెర్గము, తుయతైర, సార్దీస్, ఫిలదెల్ఫియా, లవొదికయ). లవొదికయ ఒక అందమైన పట్టణం. రోమ్ పట్టణానికి వెళ్లే హైవే మీద ఉన్న గొప్ప పట్టణం. నేటి ఆధునిక ఎస్కి-హిసార్, టర్కీలోని ఒక ప్రాంతము. క్రీస్తుపూర్వం 240 ప్రాంతంలో అంతియోకస్ అనే చక్రవర్తి దానిని పరిపాలించేవాడు. ఆయన ఈ పట్టణాన్ని నిర్మించి తన భార్య గౌరవార్థం లావోడిసియా పేరు పెట్టాడు. అంతియొకయలో వర్తకం ఎక్కువగా జరిగేది ముఖ్యంగా బంగారం, వస్త్రాలు, కాటుక. కాబట్టి ఈ పట్టణంలోని ప్రజలు ఆత్మాభిమానం కలిగి 'మాకు ఏ కొదువలేదు, మేము స్వయం సమృద్ధిగలవారమై యున్నాము" అని చెప్పేవారు. అయితే ఈ పట్టణాన్ని వాటర్ సమస్య పట్టి పీడించేది. ఇక్కడ సీజర్ వర్షిప్ జరిగేది, ఇక్కడ మెడికల్ స్కూల్ కూడా ఉండేది. ఈ పట్టణానికి పౌలు ద్వారా రక్షించబడిన ఎఫఫ్రా సువార్తను ప్రకటించడం ద్వారా కొలస్సీ, హియెరపొలి, లవొదికయ పట్టణాల్లో సంఘాలు స్థాపించబడ్డాయి. మొదట్లో ఈ లవొదికయ పట్టణంలో అద్భుతమైన పరిచర్య జరిగింది. 30 సంవత్సరాల తర్వాత ఆ సంఘంలో వచ్చిన పరిస్థితులు బట్టి, ఆత్మీయ స్థితిలో దిగజారిన పరిస్థితులు బట్టి యేసుప్రభువు యోహాను ద్వారా ఈ విషయాలను లవొదికయ సంఘానికి రాస్తున్నారు.


## బైబిల్ స్టడీ చర్చకు ప్రశ్నలు

1. లవొదికయ సంఘానికి యేసుక్రీస్తు ప్రభువు తన్నుతాను ఏ విధంగా పరిచయం చేసుకుంటున్నాడు?
2. ఆ విధంగా పరిచయం చేసుకోవడంలో లవొదికయ సంఘం వారు యేసుప్రభువుని ఏ విధంగా అర్థం చేసుకోవాలని కోరుకుంటున్నాడు?



3. లవొదికయ సంఘం తన గురించి తాను ఏ మనుకుంటుంది. అయితే దాని నిజమైన ఆత్మీయ స్థితి ఏంటి?
4. 'నులివెచ్చని స్థితిలో ఉండిన మేలు' అనే మాటకు చారిత్రక నేపథ్యం ఏంటి?
5. ఆత్మీయ జీవితంలో నులివెచ్చని స్థితి అంటే ఏంటి? నులి వెచ్చని ఆత్మీయ జీవితంలో ఎదుర్కొనే ప్రమాదాలు ఏమై ఉండొచ్చు?
6. ఒక సంఘం ఉండి దానిలో మెచ్చుకోదగిన లక్షణాలు ఏమీ లేకపోతే ఎలా ఉంటుంది?
7. లవొదికయ సంఘంలోని సమస్యలకు యేసుక్రీస్తు ప్రభువారు ఎలాంటి పరిష్కారాల్ని వివరిస్తున్నారు?
8. లవొదికయ వారు ఆయనకి ప్రతిస్పందిస్తే వారితో యేసు చేసే వాగ్దానాలను బట్టి మనం ఏమి అర్థం చేసుకోవచ్చు?
9. విశ్వాసులుగా నులివెచ్చని స్థితి ఏ యే పరిస్థితుల్లో మన జీవితంలో అనుభవిస్తున్నాము వివరించండి.
10. నులివెచ్చని ఆత్మీయ స్థితి నుంచి బయట పడాలంటే విశ్వాసులుగా మనం ఏం చేయాలి?

– దేవసహాయం, మేరీ గ్రేస్, స్టాఫ్, ఒంగోలు



స్ఫూర్తి

# విశ్వమాత

మదర్ థెరిస్సా రోమన్ కేథలిక్స్ లేదా క్రైస్తవులకు మాత్రమే చెందిన వ్యక్తికాదు, యావత్ ప్రపంచానికి చెందిన వ్యక్తి. ఒక మతానికి సంబంధించిన వ్యక్తి అయివుండి ఆమె జీవించి ఉన్న కాలంలోనే క్రైస్తవుల్లోని అన్ని శాఖలవారి చేత, అలాగే అన్ని మతాలవారి చేత గౌరవింపబడిన వ్యక్తి చరిత్రలో థెరిస్సా ఒక్కరే. ఈమె 5 సెప్టెంబర్ 1997లో మరణించినప్పుడు జీవితమంతా సేవకే సమర్పించిన ఆమెకు ప్రపంచ వ్యాప్తంగా హృదయపూర్వక అభినందనలు వెల్లువెత్తాయి. ఆమె చనిపోయే నాటికి మిషనరీస్ ఆఫ్ ఛారిటీ 4,000 మంది నన్స్, 300మంది సోదర సభ్యులతో పాటు, 1,00,000 పైగా సాధారణ కార్యకర్తలను కలిగి 123 దేశాలలో 610 శాఖలను కలిగి ఉంది.

తగ్గింపు జీవితం, సాధారణ జీవనశైలి, త్యాగం మదర్ థెరిస్సా పరిచర్యలో కనిపించే లక్షణాలు. ఆమెను వ్యక్తిగతంగా కలిసినవారు ఆమె పట్టుదలగల వ్యక్తి అని కూడా చెబుతారు. ఆ పట్టుదలకు రాజీపడని తత్వం కూడా జతకలుస్తుంది. పేదలకు సేవచేయుటకు దేవుడు నన్ను పిలిచాడు అన్న బలమైన ఒప్పుదల ఆమెను నడిపించింది. ప్రభుత్వ అధికారులు, సంఘఅధికారులు, అల్లరి మూకల వ్యతిరేకతను, హేళనను కూడా తట్టుకొని నిలబడటానికి కారణం ఆ ఒప్పుదలే.

1985లో ప్రసారమైన ఒక టెలివిజన్ కార్యక్రమంలో, ఇథియోపియా నుంచి వచ్చిన ఒక మంత్రిని నిరుపయోగంగా ఉన్న రెండు భవనాలను తన మిషనరీష్ ఆఫ్ ఛారిటీకి ఇవ్వమని పదేపదే అభ్యర్థించింది. కెమెరాల ముందు ఉన్నందున, మొదట కొంత అయిష్టతచూపినా, తర్వాత ఒప్పుకోక తప్పలేదు. తన బ్యాండ్ ఎయిడ్ ప్రచారంలో భాగంగా ఆడిస్ ఆబాబా విమానాశ్రయంలో ఈ కార్యక్రమాన్ని చూసిన ఇథియోపియా ప్రఖ్యాత పాప్‌సింగర్ అయిన 'బాబ్ గెల్డార్ఫ్' ఇలా అన్నాడు, "ఆమె పదే పదే అలా అభ్యర్థించడం వెనుక ఖచ్చితంగా ఏదో ఒక

ఉద్దేశ్యముండి ఉంటుంది". ఆమె సంపూర్ణంగా నిస్వార్థ సేవకురాలు. వచ్చిన ప్రతి పరిస్థితిని ఇతరుల సేవకు ఎలా ఉపయోగించాలా అని ప్రతి నిమిషం ఆమె ఆరాటపడుతుంది.

మదర్ థెరిస్సా అసలు పేరు ఆగ్నెస్ గోన్‌షా బొజాక్షువు. అల్బేనియా దేశంలో 26 ఆగష్టు, 1910 సం॥లో జన్మించింది. ఆమె తండ్రి ఒక వ్యాపారి. ఆమెకు 9 సం॥ వయస్సులో తన తండ్రి చనిపోయాడు. దీనితో థెరిస్సా కుటుంబం ఆర్థిక సమస్యల్లో చిక్కుకొన్నది. కాని దేవుని యందు వారి విశ్వాసమే వారిని నిలబెట్టింది. తన అమ్మ, అన్న, చెల్లితో కలిసి ప్రతిరోజు చర్చ్‌కి వెళ్ళేది. చర్చ్ క్వయర్‌లో పాటలు పాడేది. పేదరాలు, విధవరాలైన తన తల్లి రోగముచే బలహీనురాలైన తన పొరుగుస్త్రీకి సేవచేసేది. తర్వాత అనాధపిల్లలైన ఆరుగురిని తన కుటుంబంలోనికి ఆహ్వానించి, వారిని పోషించింది. ఇది ఆగ్నెస్‌ను ప్రభావం చేసి ఉంటుంది.

12 సం॥ వయస్సులో సేవకై దేవుని పిలుపును అందుకుంది. కాని దాన్ని ధృవీకరించుకొనే విషయంలో చాలా ఇబ్బంది పడింది. ఆమె ప్రార్థించింది. తన తల్లితో, సోదరితో మాట్లాడినా సమాధానం లేదు. అప్పుడు తన పరలోకపు తండ్రిని ప్రార్థించింది, "నేను ఈ విషయాన్ని ఎలా ధృవీకరించుకోవాలి అని?" "నీ జీవితంలో సంతోషం ద్వారా. ఆయనను సేవించడానికి దేవుడు నిన్ను పిలుచుచున్నాడు అన్న మాటలు నీకు సంతోషాన్ని కలుగజేస్తే, అప్పుడు ఇది దేవుని పిలుపు అని ధృవీకరించుకో. నీ హృదయాంతరాల్లో నీవు అనుభవించే శాంతి నీ జీవితానికి చుక్కాని లాంటిది" అని ఆయన జవాబిచ్చాడు.

దేవున్ని సేవించుటలో ఉన్న సంతోషాన్ని ఆమె అనుభవిస్తూనే ఉన్నది. 1929లో 19 సం॥ వయస్సులో ఒక ఉపాధ్యాయురాలిగా, నన్‌గా ఉండుటకు సిద్ధపడి కలకత్తా (నేటి కోల్‌కతా) వచ్చేసింది. మొదటినుంచి ఆమె పేదలపట్ల శ్రద్ధ చూపించేది. రెండు దశాబ్దాల వరకు లోరెంటో కాన్వెంట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసింది. అక్కడ బాలికలకు భూగోళశాస్త్రం బోధించేది. ఆమె తన విద్యార్థులను ప్రేమించింది. వారుకూడా ఆమెను ప్రేమించే వారు. వారాంతంలో వీధులలో ఉన్న పేదవారికి సేవచేయడానికి ఆగ్నెస్ వెళ్ళినప్పుడు వారు కూడా వచ్చి ఆమెకు సహాయం చేసేవారు.

సంపూర్ణంగా పేదవారి సేవకే అంకితమవ్వాలన్న పిలుపు థెరిస్సాకు అకస్మికంగా వచ్చింది. దేవునినుండి వచ్చిన స్పష్టమైన పిలుపు అది. ఆ పిలుపుకు లోబడడం ఆమెకు చాలా కష్టమైపోయింది. "లొరెంటోను వదిలిపెట్టడం అత్యంత గొప్ప త్యాగంలా, అత్యంత కష్టమైన పనిలా నాకు అన్పించింది. భక్తిజీవితం ప్రారంభించడానికి నా కుటుంబాన్ని, దేశాన్ని నేను విడిచిపెట్టినదానికంటే ఇది ఇంకా కష్టంగా తోచింది. ఎందుకంటే లొరెంటోనే నా సర్వస్వమని భావించాను" అని గతాన్ని గుర్తు చేసుకొంటూ తెలిపింది థెరిస్సా.

హిమాలయాల్లో ఒక రిట్రీట్‌కు వెళ్తుండగా 1946లో థెరిస్సాకు ఈ పిలుపు వచ్చింది. "నేను రైల్లో ప్రయాణిస్తూ ఉన్నాను. నిరుపేదలైనవారిని సేవించడానికి మురికివాడల్లోకి వెళ్ళాలనే పిలుపు నాకు వచ్చింది. వారితోనే ఉంటూ, వారికి సేవచేయాలంటే నేను కాన్వెంట్‌ను వదిలి పెట్టాలి. అది ఒక సన్యాసినుల ఆశ్రమం. నేను దానికి చెందిన దానను. ఇప్పుడు దానిని వదిలి పెట్టి, అక్కడకు ఎలా వెళ్ళాలో నాకు అర్థంకాలేదు".

38 సం॥ వయస్సులో మదర్ లొరెంటో రక్షణ వలయాన్ని వదిలిపెట్టింది. దానితోపాటే నన్ ధరించే తెలుపు, నలుపు దుస్తులను వదిలి, నీలం అంచుగల తెలుపు దుస్తులను ధరించడం ప్రారంభించింది. తర్వాత పోప్‌నుండి అనుమతిపొంది, ఒక నూతన ఆశ్రమాన్ని స్థాపించింది. ఇందులోని సభ్యులు ఖచ్చితంగా పేదరికము, పరిశుద్ధత, విధేయత అను ఈ మూడు సూత్రాలను పాటించాలి. పేదలకు సేవచేస్తే దేవునికి సేవచేసినట్లేనని మదర్ అభిప్రాయపడుతుండేవారు. సాధారణ జీవనశైలిని వారు కలిగి ఉంటూ పనిని సమానంగా పంచుకొంటూ ఉండేవారు. మరణ పడకలమీద ఉన్నవారికి, ఏ ఆశ్రయం లేనివారికి ఆహారం, మందులు, సహవాసం ఇలా వారికి ఏది అవసరమైతే దాన్ని అందిస్తూ ఉండేవారు.

తాను చేస్తున్న మానవ సేవకు సంబంధించి దీర్ఘకాలిక ప్రభావం గూర్చి కొన్నిసార్లు సవాళ్ళు

ఎదుర్కొంటూ ఉండేవారు. ఉదా॥ కొంతమంది ఆమెను ఇలా ప్రశ్నిస్తూ ఉండేవారు, "చేపను పట్టడం నేర్పించాలిగాని ఇలా చేపనే ఇస్తే ఎలా?" దీనికి ఆమె ప్రతిస్పందిస్తూ, "నిజమే, కాని వీరు కనీసం నిలబడలేరు. వారు రోగులు, అంగహీనులు, మతిస్థిమితంలేనివారు. నేను వారికి చేపను ఇస్తేనే వారు నిలబడతారు. నేను వారిని బలపర్చి మంచి ఆరోగ్య స్థితికి తీసుకు వస్తాను. అప్పుడు మీరు వారికి చేపలు పట్టడానికి అవసరమైన కర్ర,గాలం ఇవ్వండి". అలాగే తాను చేప (ఆహారం) కంటే ఇంకా ఎక్కువే ఇస్తున్నానని నొక్కి చెప్పేవారు.

వారిని సంరక్షించడమే కాదు. దానితో సమానంగా ఆమె హృదయంలో నుండి ప్రేమ, సంతోషం వచ్చేవి. పేదవారికి అవసరమైనది సేవ మాత్రమే కాదు, ఇంకా ఎక్కువే వారికి అవసరం అని ఆమె నొక్కి చెబుతుండేవారు. "మన పనులు కేవలం మంచివి మాత్రమే అయి ఉండి, వాటి ద్వారా పేదలకు సంతోషం, ప్రేమలు అందకపోతే, దేవునికి వారు సమీపంగా రావాలన్న మన లక్ష్యానికి ఎన్నడూ చేరుకోలేరు. తమను ప్రేమించే వారు కొంతమంది ఉన్నారు అన్న భావం వారిలో కలగాలి".

లొరెంటోని వదిలిన నాలుగు సంవత్సరాల తర్వాత 1952లో మరణించబోతున్న వారికొరకు, ఆశ్రయంలేని వారి కొరకు "నిర్మల్ హృదయ్"ను కలకత్తాలో ప్రారంభించారు. తర్వాత పది దశాబ్దాలలో మదర్ తన పరిచర్యను ఐదు ఖండాలకు విస్తరించారు. ఆమె పరిచర్య ప్రారంభించిన తర్వాత 20 సం॥లు వరకు ఎలాంటి గుర్తింపుకు నోచుకోలేదు. 1969 సం॥లో బిబిసి ఛానల్ కొరకు మాల్కమ్ మాగరిడ్జ్ ఆమెను ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ పరిస్థితి మారి పోయింది.

మాల్కమ్ మాగరిడ్జ్ మదర్ జీవితం ఆధారంగా 'సంథింగ్ బ్యూటిఫుల్ ఫర్ గాడ్' అనే పేరుతో ఒక పుస్తకాన్ని, ఒక లఘుచిత్రాన్ని రూపొందించాడు. దీనితో మదర్ అంతర్జాతీయంగా ప్రసిద్ధ వ్యక్తిగా మారిపోయింది. ఎలిజబెత్‌రాణి నుండి, ఆ వెంటనే అమెరికా పార్లమెంట్ నుండి, హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుండి కూడా ఆమెకు సామాజిక గుర్తింపు వచ్చింది. ఈ విశ్వవిద్యాలయం మదర్‌కు గౌరవ డాక్టరేట్ బిరుదును ప్రధానం చేసింది. 1979లో ఆమెకు నోబెల్ శాంతి బహుమతి వచ్చింది. ఆ



బహుమతి అందుకునే సమయంలో, ఆ లైట్ల వెలుతురులో మదర్ అసౌకర్యంగానే కన్పించింది. "వీటిని స్వీకరించడం కంటే ఒక కుష్టు వ్యాధిగ్రస్తునికి స్నానం చేయించడమే నాకు తేలిగ్గా ఉంటుంది" అని అన్నారు. ఈ సమయంలో ప్రపంచ శాంతిని పెంపొందించేందుకు మనం ఏమి చేయగలం అని అడిగినప్పుడు ఆమె "ఇంటికి వెళ్ళి మీ కుటుంబాన్ని ప్రేమించండి" అని చెప్పారు.


కుష్టువ్యాధితో ఉన్న ఒక రోగికి స్నానం చేయించడమే ఆమె వదిలి వెళ్ళిన గొప్ప వారసత్వం (లెగసీ). అంతర్జాతీయంగా ఆమె గడించిన పేరు ప్రఖ్యాతులను బట్టి ఆమెను వెంబడించిన వేల కొలది నన్సను బట్టి, ప్రపంచవ్యాప్తంగా ఆమె స్థాపించిన శరణాలయాలను బట్టి, ఆమె అందరికీ గుర్తుండవచ్చు. ఈ విశ్వపటం మీద ఆమె చిత్రాన్ని ముద్రించాల్సివస్తే, అప్పుడు ముద్రించబడేది చర్మం ముడతలు పడిన ఒక స్త్రీ అత్యంతహీనంగా ఎంచబడిన ఒక వ్యక్తిని చేరదీస్తున్న చిత్రమే.

ఆమె సాధించిన కార్యాలను, కృత్యాలను విశ్లేషిస్తూ పోప్ జాన్‌పాల్-II ఈ విధంగా ప్రశ్నించారు: "ఇతరుల సేవకై తనను వినియోగించుకొనే శక్తిని, పట్టుదలను మదర్ ఎక్కడ నుండి పొందుతారు?" అనగా ఆమె "దానిని తన ప్రార్థనలో, యేసుక్రీస్తు యొక్క నిశ్శబ్దధ్యానంలో" అని సమాధానమిచ్చారు.

మదర్ తన 66 సం॥ను దీర్ఘకాలంలో మతాధికారులకు, తన పైవారికి అనేక ఉత్తరాలు రాశారు. ప్రజలు తన గురించి ఎక్కువగా, క్రీస్తు గురించి తక్కువగా ఆలోచిస్తారనే ఉద్దేశ్యంతో ఆ ఉత్తరాలను నాశనం చేయాల్సిందిగా కోరారు. ❄

**– విజె డెస్క్**

# ఈ తరం భయాలు



అభయ్ బిటెక్ ఫైనలియర్ చదువుతున్నాడు. పేరుకు మాత్రం అభయ్ కానీ భయాల పుట్ట. చదువు గురించి ఆలోచించినా, నలుగురు ముందు మాట్లాడాలన్నా.. భవిష్యత్ గూర్చి ఆలోచించాలన్నా... ఇలా అనేకరకాల భయాలు అభయ్‌ని వెంటాడుతూ ఉన్నాయి. ఆ భయాల వల్ల జీవితం ముందుకు సాగడం లేదు. కోరుకున్న లక్ష్యాన్ని చేరలేకపోతున్నాడు.

అభయ్ లాగే విశ్వాస విద్యార్థుల్లో కూడా అనేక భయాలు వెంటాడుతున్నాయి. యేసుక్రీస్తు శిష్యునిగా భారతదేశ విద్యార్థులను ప్రభావితం చేసే క్రమంలో ఈ తరం విశ్వాస విద్యార్థులు ఎదుర్కొంటున్న కొన్ని భయాలను మనం తెలుసుకొని వాటి నుండి ఏ విధంగా బయటపడాలో తగిన సూచనలను అన్వేషిద్దాం.

## ఫెయిల్ అవుతానేమో అనే భయం

ప్రస్తుత విద్యార్థి లోకం మంచి మార్కులు సాధించలేనేమోనని, మంచి కళాశాలలో చేరలేనేమోనని, మంచి ఉద్యోగం పొందలే నేమోనని...కుటుంబంలో, క్యాంపస్‌లో, సమాజంలో ఎదురయ్యే పరిస్థితులను బట్టి చాలా భయపడుతున్నారు. వారు విఫలమవుతామన్న భయంతో ఏ రంగంలోనూ రాణించలేకపోతున్నారు. వారు రాణించవలసిన సందర్భాలలో విఫలమైనప్పుడు అది డిప్రెషన్‌కు, కొన్ని సందర్భాలలో ఆత్మహత్యకు కూడా దారి తీస్తుంది. ఇటువంటి పరిస్థితులకు కారణం వ్యక్తిగత జీవనశైలితో పాటు, క్యాంపస్‌లో, కుటుంబంలో, సమాజంలో పరిస్థితులు తోడవుతున్నాయి. అనేక ఒత్తిళ్ళు, అంచనాలు విద్యార్థి మీద అధిక భారాన్ని తీసుకొని వస్తున్నాయి.

మనమందరం జీవితంలో విఫలమవుతాం. వైఫల్యం అనివార్యం. దానివల్ల మనం భయంతో జీవించాలని దీని అర్థం కాదు గానీ, విఫలమైనా ప్రయత్నిస్తూ ఉండాలి. ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కోవాలి. వైఫల్యం గురించి తక్కువగా ఆలోచించి, చేయాల్సినదాని గురించి, కష్టపడడం గురించి, దేవుని మీద ఆధారపడడం గురించి ఎంత ఎక్కువగా ఆలోచిస్తే అంత మంచిది. "నేను మిమ్మల్ని గూర్చి ఉద్దేశించిన సంగతులను నేను ఎరుగుదును, రాబోవు కాలమందు మీకు నిరీక్షణ కలుగునట్లుగా అవి సమాధానకరమైన ఉద్దేశములే గాని హానికరమైనవి కావు; ఇదే యెహోవా వాక్కు" (యిర్మీయ 29:11).

## ఏదైనా మిస్ అవుతానేమో అనే భయం (ఫోమో)

నేటి విద్యార్థులు తమ స్నేహితులతో ఉన్న సంబంధాలను, సాన్నిహిత్యాన్ని కోల్పోతారేమో అనే భయం విపరీతంగా ఉంటుంది (ఫోమో). అందుకే ఎప్పుడూ కాంటాక్ట్‌లో ఉండాలని తపిస్తారు. అందుకనే చాలామంది విద్యార్థులు సోషల్ మీడియాకు గంటలకొలది సమయాన్ని వెచ్చిస్తారు. సామాజిక జీవితాన్ని కోల్పోతాము అన్న భయం వారిని వెంటాడుతూ ఉంటుంది. నిమిషానికి ఒకసారి ఫోన్ చూసుకుంటూ ఉంటారు. ఇతరుల జీవితాలలో ఏమి జరుగుతుందో తెలుసుకోవడంలో ప్రస్తుత విద్యార్థులు ఎంతగానో ఆసక్తి చూపిస్తున్నారు. వారు అభిమానించే నటీనటులను అనుకరించే క్రమంలో తమను తాము ఉత్తమంగా ప్రదర్శించుకునే ఫోటోలను అప్‌లోడ్ చేయాలనే ఆశ వారిపై అధికంగా ఉంది.

కిరణ్‌కు ఫేస్‌బుక్‌లో 1000 మంది ఫ్రెండ్స్ ఉన్నారు. తన జీవితంలో ఎక్కువ సమయం ఆన్‌లైన్‌లో వారికే కేటాయించేవాడు. అతనికి యాక్సిడెంట్ అయినప్పుడు హాస్పటల్లో బెడ్ దగ్గర ఆ ఫ్రెండ్స్ ఎవ్వరూ లేరు, తల్లిదండ్రులు మాత్రమే ఉన్నారు. మన సమయాన్ని మనల్ని ప్రేమించే కుటుంబానికి, కెరీర్‌కు ఇవ్వాలి. విద్యార్థుల కెరీర్ కంటే ఏదీ

ముఖ్యమైనది కాదు, వ్యక్తులు నీ గురించి నిజంగా శ్రద్ధ వహిస్తే వారు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తారు, మీతోనే ఉంటారు. యేసుక్రీస్తు నిజమైన స్నేహితుడు, శ్రద్ధ వహించేవాడు. "చూడుము నా అరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను" (యెషయా 49:16) అని చెబుతున్నాడు. గనుక సమయాన్ని వ్యర్థంగా పోగొట్టుకోకుండా సద్వినియోగం చేసుకోవాలి.

## తిరస్కరిస్తారనే భయం

ప్రస్తుత విద్యార్థులు తిరస్కరణను ఎదుర్కోవడానికి చాలా భయపడుతున్నారు. ముఖ్యంగా తమకు ఇష్టమైన వారు తిరస్కరిస్తారని లేక ఇంటర్వ్యూలలో ఫెయిల్ అవుతామని చెప్పలేనంత బాధను అనుభవిస్తున్నారు. వారు ప్రస్తుత జీవితాన్ని ఎంజాయ్ చేయకుండా భవిష్యత్ గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. తిరస్కరణ తరువాత వారు ఎదుర్కోవాల్సిన పరిణామాల గురించి విద్యార్థులు ఎల్లప్పుడూ ఆలోచిస్తున్నారు. అందుకే చాలామంది విద్యార్థులు తమ భావాలను, భయాలను ఎవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరు. ముఖ్యంగా ఇంటర్వ్యూల సమయంలో తిరస్కరణ ఎదురవుతుంది అన్న భయాందోళన వల్ల సరిగ్గా ఇంటర్వ్యూలను చేయలేక పోతున్నారు.

జీవితంలో వైఫల్యాలు ఎంత సహజమో, తిరస్కరణ కూడా అంతే సహజం. తిరస్కరణ కూడా మన జీవితాల్లో ఒక ముఖ్యమైన భాగమని గ్రహించాలి. మనము తిరస్కరించ బడకపోతే మన జీవితంలో ఎప్పటికీ మెరుగుపడలేము. కాబట్టి తిరస్కరణల నుండి పారిపోవడం కంటే వాటిని ఎదుర్కోవడం నేర్చుకోవాలి. "నా తల్లిదండ్రులు నన్ను విడచినను, యెహోవా నన్ను చేరదీయును" (కీర్తనలు 27:10).

## ఫలితం ఉండదేమోనన్న భయం

మరికొంత మంది విద్యార్థులు పని పట్ల ఎక్కువ మక్కువ కలిగి ఉంటారు. మితిమీరిన మక్కువతో వారి యొక్క జీవితంలో అనుకున్నది సాధించలేమేమో అని ఆందోళనకు గురి అవుతారు. పని పట్ల వారికున్న మక్కువ వారి యొక్క సామాజిక జీవితం నుండి తమని తాము దూరపరచుకుంటారు. కాసేపు సరదాగా ఎంజాయ్ చేయడం అన్నది వారికి తెలియదు. ఈ కారణాలను బట్టి అనుకున్నది సాధించడం కొరకు కష్టపడినప్పటికీ ఆశించిన ఫలితం లేకుండా పోతుంది.

మన పని పట్ల మక్కువ చూపడం మంచిదే గాని విరామం లేనంతగా, విశ్రాంతి తీసుకోకుండా పని చేయడం మన రిజల్ట్స్‌పై ప్రభావితం చూపుతుంది. మన దినచర్య నుండి కొంత విరామం తీసుకోవడం అన్నది కూడా మన ప్లానింగ్‌లో భాగమై ఉండాలి. ఇది మన పనిని మరింత మెరుగ్గా చేయడానికి శక్తిని ఇస్తుంది. "అప్పుడు ఆయన మీరేకాంతముగా అరణ్య ప్రదేశమునకు వెళ్లి కొంచెము సేపు అలసట తీర్చుకొనుడని చెప్పెను" (మార్కు 6:31).

## సుఖవలయం నుంచి బయటకు రావాలంటే భయం

భారతీయ విద్యార్థులుగా కొత్తగా ప్రయత్నించాలి అన్న దానికి ఎక్కువగా సుముఖత చూపించము. మన రొటీన్ పనిని మాత్రమే చేయడానికి ఇష్టపడతాము. కొంతమంది విద్యార్థులు ప్రయత్నించినప్పటికీ వారు ఎదుర్కోవాల్సిన మార్పు కారణంగా వెంటనే ఆ ప్రయత్నాన్ని విరమించుకుంటారు.

మన రొటీన్ లైఫ్‌ను అనుకరిస్తే మన జీవితంలో పురోగతి సాధించలేము. మనము మన కంఫర్ట్ జోన్ నుండి బయటకి వచ్చినప్పుడే మన నిజమైన జీవితం ప్రారంభం అవుతుంది. మొదట్లో మార్పులకు అనుగుణంగా మారడం కష్టంగా అనిపించినా, తరువాత వాటికి అలవాటు పడతాము. అందువల్ల కొత్తదనాన్ని నేర్చుకోవడానికి, కష్టపడి పని చేయడానికి ఎప్పుడూ సిగ్గు పడకూడదు. "ఆయన రమ్మనగానే పేతురు దోనె దిగి యేసు వద్దకు వెళ్ళుటకు నీళ్ల మీద నడిచెను" (మత్తయి 14:29).

## అందరిముందు మాట్లాడాలంటే భయం

ఈ సమస్య కళాశాల ప్రాంగణాలలో ఉంటున్న విద్యార్థులు మాత్రమే కాకుండా అనేకమంది అనుభవిస్తున్న గొప్ప సమస్య. చాలామంది విద్యార్థులు తమ పరిసరాల గురించి మితిమీరిన స్పృహ కలిగి ఉండడం ద్వారా వారు బహిరంగంగా మాట్లాడడానికి ప్రయత్నించరు. సంవత్సరాల తరబడి సంకోచిస్తూ ఉంటారు. ఈ ఫోబియా నుండి బయటపడేందుకు చాలా సమయం పడుతుంది. అతి తక్కువ మంది విద్యార్థులు ఈ నైపుణ్యం యొక్క ప్రాముఖ్యతను గ్రహించినవారై పబ్లిక్ స్పీకింగ్‌లో పాల్గొనడం ప్రారంభిస్తారు.

పబ్లిక్ స్పీకింగ్ అంటే భయము ఉండడం

సర్వసాధారణం కానీ ప్రస్తుత రోజులలో పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ మనకు ఎంతగానో సహాయ పడతాయి. కళాశాలలో ప్రజెంటేషన్ ఇచ్చే విషయంలో, ఏ ప్రోగ్రామ్ అయినా నడిపించే విషయంలో ఈ స్కిల్ ఎంతగానో ఉపయోగ పడుతుంది. కాబట్టి ఈ విషయంలో మెరుగుపడాలి. అంటే పబ్లిక్‌గా మాట్లాడడం ప్రారంభించాలి. ప్రజలు మనల్ని ఎగతాళి చేస్తారు అన్న భయం నుండి మనము త్వరగా బయటపడాలి. “కాబట్టి వెళ్ళుము, నేను నీ నోటికి తోడైయుండి, నీవు ఏమి పలకవలసినది నీకు బోధించెదనని అతనితో చెప్పెను” (నిర్గమకాండము 4:12).

### సువార్త చెప్పాలంటే భయం

మొట్టమొదటగా నేను ఒక క్రైస్తవుడిని అని కళాశాలలో తెలియపరచుకోవడానికి భయం. యేసుక్రీస్తుని మన స్నేహితులకు పరిచయం చేయాలనే ఆశ ఉన్నప్పటికీ, వారు ఏ విధంగా స్పందిస్తారో అనే భావన మనలో ఎక్కువగా ఉంటుంది. వారితో ఉన్న స్నేహాన్ని కోల్పోవాల్సి వస్తుంది అనే భయం కూడా మరోక కారణం. మన స్నేహితుల మధ్య మనకు సరైన సాక్ష్యం లేకపోవడం. సాక్ష్యం అనగా చదువులలో, ప్రవర్తనలో మన బోధకు తగ్గట్లుగా జీవించకపోవడం.

యేసుక్రీస్తుని గూర్చిన సువార్త ప్రకటించటం ప్రతి ఒక్క విశ్వాసి బాధ్యత, ఎందుకనగా ఇది దేవుని ఆజ్ఞ. లైఫ్ స్టైల్ ఇవాంజిలిజంను క్రియారూపకంగా చూపించగలగాలి. “సువార్తను ప్రకటింపవలసిన భారము నామీద మోపబడియున్నది. అయ్యో, నేను సువార్తను ప్రకటింపక పోయినయెడల నాకు శ్రమ” (1 కొరింథీ 9:16).

### ముగింపు

ఈ భయాల నుండి బయటపడి, మనము చదువుతున్న కళాశాలలో సాక్షిగా ఉండేందుకు దేవుని సహాయాన్ని కోరుకోవాలి. మన జీవితాన్ని దేవుని వాక్యపు వెలుగులో పరిశీలించుకోవాలి. దేవునికి అయిష్టమైనదాన్ని వదిలివేయడానికి తీర్మానించుకోవాలి. అలా ఉండడానికి ప్రభువు మనందరికి సహాయం చేయును గాక.

– **పిసి పాల్ జాషువ**, స్టాఫ్, విజయవాడ

కవిత



## ఒక్కసారి ఆలోచించు!

ప్రార్థన లేని జీవితం
గాలికి ఎగిరిపోయే పొట్టు లాంటిది
పొట్టు వలె ఎగిరి పతనమవుతావో
పట్టువిడవక ప్రార్థిస్తావో
ఒక్కసారి ఆలోచించు!

పవిత్రత లేని జీవితం,
సారం లేని ఉప్పు లాంటిది
సారం లేని ఉప్పువలె తొక్కబడతావో
సత్యసాక్షిగా ఉంటావో
ఒక్కసారి ఆలోచించు!

విశ్వాసం లేని జీవితం
ఫలము లేని ఎండిన చెట్టు లాంటిది
ఫలములేని జీవితం ప్రమాదమని ఎరుగుతావో
పరిశుద్ధ జీవితం కోరుకొంటావో
ఒక్కసారి ఆలోచించు!

రక్షణ లేని జీవితం
నరకానికి ప్రయాణం లాంటిది
నరకంలో యుగయుగాలు ఉంటావో
నజరేయుని వేడుకొంటావో
ఒక్కసారి ఆలోచించు!

– **సంగర్తి హరీష్,**
మెట్‌పల్లి, జగిత్యాల జిల్లా



# పాపము

నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్-2022 సంవత్సరానికి మన దేశంలో 35,61,379 నేరాలు, ఘోరాలు జరిగాయి. రికార్డ్స్‌లోకి రానివి ఎన్నో ఊహించడం కష్టం. 2022 సంవత్సరానికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కొన్ని నేరాలను గమనిస్తే గ్యాంగ్‌రేప్‌లతో 8 మంది, కట్నం సమస్యలతో చనిపోయినవారు 101 మంది, పరువు హత్యలు 2, ప్రేమ వ్యవహారాలతో చనిపోయినవారు 22 మంది, అక్రమ సంబంధాలతో చనిపోయినవారు168 మంది, కుటుంబ తగాదాలు, భర్తల క్రూరత్వంతో నమోదైన కేసులు 12,185, ఆత్మహత్యలు 366, కిడ్నాప్‌లు 756, రేప్‌లు 627, యాసిడ్ ఎటాక్స్ 8 ... ఇలా ఎన్నో జరిగాయి. మానవునిలోని ఈ నేర ప్రవృత్తికి, తప్పుచేయడానికి, అశాంతికి, సమాధానం లేకపోవడానికి మూల కారణమైన పాపాన్ని గూర్చి మనం తెలుసుకోవాలి.

"తప్పు చేయడం మానవ తత్వం" అనే నానుడితో పాపాన్ని సమర్థించుకోవటం నేడు చూస్తున్నాం. పాపంను గురించి పరిశీలిస్తే, మనకు రెండు ఆశ్చర్యకరమైన వాస్తవాలు ఎదురవుతాయి.

## 1. పాపము పట్ల మానవ దృక్పథం

మనిషి పాపంను చాలా తక్కువగా చూస్తాడు. కొందరికి ఇది కేవలం మానవ బలహీనత లేదా ధోరణి, ఒక భ్రమ, కొంతమంది మతోన్మాదుల ఆవిష్కరణ. పాపము గురించి ఎవరైనా మాట్లాడితే నవ్వుకుంటూ ఎగతాళి చేస్తున్నారు. పాపం నిజమని నమ్మే చాలామంది, దాని శిక్ష గురించి కొంచెం కూడా ఆలోచించకుండానే దానిలో కొనసాగుతున్నారు. ఆధునిక తత్వశాస్త్రం పాపం ఉనికిని నిరాకరిస్తుంది, కానీ అలాంటి తిరస్కరణ భావన ఏదైనా అది తత్వశాస్త్రంలో తప్పు.

## 2. దేవుని దృష్టిలో పాపము

దేవుడు పాపంను చాలా ఘోరమైనదిగా చూస్తాడు. "పాపం చేస్తే ఆత్మ చనిపోతుంది" (యెహెజ్కేలు 18:20). "పాపం యొక్క జీతం మరణం" (రోమా 6:23). పాపాలన్నీ దేవునికి అసహ్యమైనవి (సామెతలు 6:16-19). అధర్మం చేసే వారిని ఆయన ద్వేషిస్తాడు (కీర్తన 5:5). "...అన్యాయంగా ప్రవర్తించే వారందరూ, మీ దేవుడైన యెహోవాకు అసహ్యమే" (ద్వితీ 25:16) అని మోషే అంటాడు.

## పాపము ఒక వాస్తవం

పాపం ఒక కట్టు కథ కాదు, అది మనస్సు యొక్క కల్పన కాదు; ప్రపంచమంతా సమాజంలో ఉన్న మంచి, చెడుల మధ్య సంఘర్షణ చూస్తూ పాపం ఉనికిని తిరస్కరించడం అహేతుకం. పాపం వాస్తవం కాకపోతే, నేరం ఉండదు, జైళ్ళు అవసరం లేదు. మన ఇంటి తలుపులకు తాళాలు లేదా మన విలువైన వస్తువులకు లాకర్లు అవసరం లేదు. గనుక పాపం ఒక వాస్తవం.

## ఈ సిద్ధాంతాన్ని ఎందుకు అధ్యయనం చేయాలి?

పాపం ఉనికిని బైబిల్ ప్రకటిస్తుంది, మానవ హృదయం దానిని ప్రదర్శిస్తుంది. పాపమును గూర్చిన బైబిల్ బోధను విస్మరిస్తే క్రైస్తవ సిద్ధాంతం

వివరణ, విశ్వాసము ఏదైనా అసంపూర్ణంగా ఉంటుంది. పాపం యొక్క సిద్ధాంతం క్రైస్తవ విశ్వాసానికి ప్రధానమైనది, ఎందుకంటే పాప దాస్యములో ఉన్న మానవునికి క్రీస్తులో విమోచన అనగా పాప క్షమాపణ, నీతి, పవిత్రత, మోక్షమును గూర్చిన ప్రాథమిక సందేశం క్రైస్తవ విశ్వాస ప్రమాణానికి నాంది. పాపం మనుష్యులందరిని వెంటాడి మింగే క్రూరమృగం (ఆది 4:7). ఈ జీవితంలో దాని ఉనికిని తప్పించు కోలేము, కానీ దానిని దేవుని శక్తితో అధిగమించవచ్చు.

యుఇయస్ఐ పది విశ్వాస సిద్ధాంతాలలో నాల్గవది పాపాన్ని గూర్చిన సిద్ధాంతము. "సార్వత్రిక పాపము: ఆదాము హవ్వల నుండి విశ్వవ్యాప్తముగా సంక్రమించిన పాపము అపరాధ భావన దేవుని ఉగ్రతకు శిక్షకు మానవుని గురి చేస్తున్నాయి".

## పాపము అంటే ఏంటి?

అనేకమైన విభిన్న నిర్వచనాలలో ఈ ప్రశ్నకు సమాధానాన్ని వెతుకుతున్నప్పుడు మనిషి కొంత గందరగోళానికి గురవుతాడు. దేవుడు పాపాన్ని వర్ణించే, వివరించే విధానానికి, మనుష్యులు పాపాన్ని వర్ణించే, వివరించే విధానానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది.

- ఒక బోధకుడు చెడు ప్రవర్తనను "శిశు వాతావరణం, బాధాకరమైన అనుభవాలు, మానసిక స్థితిగతులు మొదలైనవాటిగా" లెక్కించి క్షమించాడు. ఆపై అతను ఇలా అన్నాడు, "యాభై సంవత్సరాలుగా బోధించిన తర్వాత, చర్చి పాపం గురించి చాలా ఎక్కువగా మాట్లాడుతుందని నేను భావించకుండా ఉండలేను." – క్రైస్తవ అగ్నోస్టిక్
- కొంతమందికి, పాపం విచక్షణారహితమైనది; లేదా అది శరీరబలహీనత.
- పండితునికి పాపం అజ్ఞానం; పరిణామవాదికి, ఇది మృగ స్వభావం.
- లేటెస్ట్ సిద్ధాంతం ఏంటంటే, పాపం అనేది సైన్స్ ద్వారా చికిత్స చేయవలసిన వ్యాధి, ఎందుకంటే మనిషి పాపాత్ముడు కాదు. అతను అనారోగ్యంతో మాత్రమే ఉన్నాడు. మనిషి తప్పు కాదు అతని డిఎన్ఏ తప్పు.
- ఇతరులకు, పాపం, స్వార్థం యొక్క ఒక రూపం,

కానీ పరిశుద్ధ గ్రంథములో పాపము దేవుని ధర్మశాస్త్రమును అతిక్రమించుట (1 యోహాను 3:4), దేవునిపైన తిరుగుబాటు చేయుట (ద్వితీ 9:7; యెహోషువ 1:18) అని వివరించబడింది.

**పాపాన్ని వివరించే హీబ్రూ, గ్రీకు పదాలు**

| పాత నిబంధనలో ఉన్న ప్రాథమిక హీబ్రూ పదాలు | కొత్త నిబంధనలో ఉన్న ప్రాథమిక గ్రీకు పదాలు |
|---|---|
| రా – చెడు (ఆది 38:7) | కాకోస్ – చెడ్డ (రోమా13:3) |
| రాష – దుష్టత్వం (నిర్గమ 2:13) | పోనెరోస్ – చెడు (మత్తయి 5:45) |
| ఆషామ్ – అపరాధం (హోషేయా 4:15) | ఎనోకోస్ – అపరాధం (మత్తయి 5:21) |
| చాట – పాపం (నిర్గమ 20:20) | అసెబెస్ – దైవభక్తి లేమి (రోమా1:18) |
| అవాన్ – అన్యాయం (1సమూ 3:13) | హమార్టియా – పాపం (1 కొరింథీ 6:18) |
| షగాగ్ – తప్పు (యెషయా 28:7) | అదికియా – అధర్మం (1 కొరింథీ 6:9); అనోమోస్ – అధర్మం (1 తిమోతి 1:9) |
|  | తాహ్ – దూరంగా సంచరించు (యెహెజ్కేలు 48:11) |
| | పరబటెస్ – అతిక్రమం (రోమా 5:14) |
| | అగ్నోయిన్ – అజ్ఞాని (రోమా1:13) |
| | పాపప్టోమై – దూరంగా వస్తాయి (గలతీ 6:1); మతోన్మాదులు, కపటులు (1 తిమోతి 4:2). |

పాత నిబంధనలో ఈ పదాల ఉపయోగం పాప సిద్ధాంతం గురించి కొన్ని నిర్ధారణలకు దారి తీస్తుంది.

1. పాపం ప్రాథమికంగా దేవునికి అవిధేయత చూపించడం.
2. అవిధేయత ఖచ్చితంగా పాజిటివ్‌గా తప్పు చేయడాన్ని గురించే కానీ నెగెటివ్‌గా మంచి చేయకపోవడాన్ని గురించి కాదు. మరో మాటలో చెప్పాలంటే మిస్సింగ్ ది రైట్ మార్క్ మాత్రమే కాదు కానీ హిట్టింగ్ ది రాంగ్ కూడా.
3. పాపం అనేక రూపాలను తీసుకోవచ్చు - ఇశ్రాయేలీయునికి తనపాపం యొక్క నిర్దిష్ట రూపం గురించి తెలుసు.

ఈ పదాల ఉపయోగం అనేక భావనలు సూచిస్తుంది.

1. పాపం ఎల్లప్పుడూ స్పష్టమైన ప్రమాణానికి వ్యతిరేకంగా ఉంటుంది.
2. అంతిమంగా అన్ని పాపాలు దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, దేవుని ప్రమాణాలను అతిక్రమించడం.
3. చెడు వివిధ రూపాలు తీసుకోవచ్చు.
4. మానవ బాధ్యత ఖచ్చితంగా, స్పష్టంగా అర్థం చేసుకోబడింది.



చాలా తరచుగా వాడిన పదం హమార్టియా- మిస్సింగ్ ది మార్క్. పాపాన్ని వివరించడానికి ఇది అత్యంత సమగ్రమైన పదం. "అందరూ పాపం చేసి, దేవుని మహిమను పొందలేక పోయారు" (రోమా 3:23) అని రాసినప్పుడు పౌలు హమర్టానో ఉపయోగించాడు. మనిషి అశక్తతను సూచిస్తుంది, దేవుని నైతిక ప్రమాణాన్ని చేరుకోలేని మనిషి యొక్క సంపూర్ణ అశక్తత. హమార్షియాలజీ - పాపాన్ని అధ్యయనం చేసే శాస్త్రము.

## పాపము అనగా

1. పాపం ఆజ్ఞాతిక్రమము (1 యోహాను 3:4).
2. పాపం దేవుని మహిమను కోల్పోచేసేది (రోమా 3:23).
3. పాపం అంటే దేవునికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం(యెషయా 1:2).
4. పాపం అవిశ్వాసం; అది దేవుణ్ణి అబద్ధికునిగా చేస్తుంది (1 యోహాను 5:9).
5. పాపం దేవుని చిత్తాన్ని వెదకకుండా, మీ స్వంత ఇష్టానుసారంగా మీ జీవితాన్ని ప్లాన్ చేసుకుంటూ మీ స్వంత మార్గంలో వెళుతుంది (యెషయా 53:6).
6. సకల దుర్నీతి అంతా పాపమే (1 యోహాను 5:16).

పాపం మనిషిని మోసం చేసే మూర్ఖత్వం, నాశనం చేసే శక్తి, శిక్షపాత్రులుగా చేసే వాస్తవం. పాపం దేవుడు వెల్లడించిన చిత్తానికి వ్యతిరేకంగా ఇష్టపూర్వక అవిధేయతా చర్యలు .

1. **పాపం ఒక క్రియ:** చట్టం లేదా ఆజ్ఞను ఉల్లంఘించడం పాపం.
2. **పాపం ఒక స్థితి:** నీతి లేని మనిషి పతనమైన స్థితి.
3. **పాపం ఒక స్వభావం:** దేవునికి వ్యతిరేకంగా శత్రుత్వంతో పడిపోయిన మనిషి స్వభావం.

## పాపము ఆరంభము

లేఖనాల ప్రకారం పాపం మొదట దేవదూతల ప్రపంచములో కనిపించింది. పాపము లూసిఫరులో, అంటే దేవదూతలన్నిటిలో బహుశ అత్యంత సుందరమైన, శక్తివంతమైన దూత, తన స్థితియందు సంతృప్తి చెందక, దేవునికంటే ఉన్నతమైన స్థానాన్ని పొందాలని ఆశించాడు. అదే తన పతనానికి దారితీసింది. లూసిఫరుతో పాపము ఆరంభము అయ్యింది (యెషయా 14:12-15). సాతానుగా పేరు మారింది. "దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచిపెట్టక, పాతాళ లోకమందలి కటిక చీకటిగల బిలములలోనికి త్రోసి, తీర్పుకు కావలిలో ఉంచుటకు వారిని అప్పగించెను" (2



పేతురు 2:4) అని పేతురు రాశాడు. యూదా "తమ ప్రధానత్వమును నిలుపుకొనక, తమ నివాస స్థలమును విడిచిన దేవదూతలను, మహాదినమున జరుగు తీర్పువరకు కటికచీకటిలో నిత్యపాశములతో ఆయన బంధించి భద్రము చేసెను, (యూదా 6)" రాస్తాడు. వారిలో అటువంటి అసంతృప్తి, తిరుగుబాటు ఎలా తలెత్తిందో బైబిల్ రచయితలు వెల్లడించలేదు.

## పాపం మానవ ప్రపంచంలోకి ఎలా ప్రవేశించింది?

ఆదాము, హవ్వలు దేవునికిని, ఆయన యొక్క ఆజ్ఞకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడాన్ని ఆదికాండము 3వ అధ్యాయం వివరిస్తుంది. సాతాను ఏదేను తోటలో ఆదాము హవ్వలను "మీరు దేవతల వలె ఉందురు," అనే ఆశతో వారిని శోధించి, తద్వారా మానవ జాతి అంతటికి పాపమును తెచ్చింది. ఆదాము హవ్వలు...

ఎ. దేవునిపై చెప్పిన అబద్ధాలను విన్నారు

బి. దేవుని ప్రేమను ఆయన మాటను అను మానించారు

సి. దేవుడు నిషేధించిన దానిని చూశారు


డి. దేవుడు నిషేధించిన వాటి కోసం ఆశపడ్డారు

ఇ. దేవుని ఆజ్ఞలకు పూర్తిగా అవిధేయత చూపారు.

## పాపము విశ్వవ్యాప్తం

### వారసత్వ/సంక్రమించిన పాపము

అప్పటి నుండి, మానవాళి యొక్క సకల వంశాల ద్వారా పాపము కొనసాగుతూనే వస్తుంది. ఆదాము సంతానమైన మనము ఆ పాపమును ఆయన నుండే వారసత్వంగా పొందియున్నాము. దీన్నే వారసత్వ పాపము అంటాము. రోమా 5:12




ప్రకారం "ఆదాము ద్వారా పాపము లోకములో ప్రవేశించింది, తద్వారా మరణము కూడా మానవుల అందరికి వచ్చింది. ఎందుకంటే "పాపమునకు కలుగు జీతము మరణము" (రోమీయులకు 6:23). ఆదికాండము 3:1-24లో ఆదాము పాపము చేసినప్పుడు, అతని సంతానం పాడైపోయింది (1 పేతురు 1:23) కాబట్టి, మనము పాపులము, ఎందుకంటే మనము పాపములో పుట్టాము (కీర్తన51:5) పిల్లలకు చెడుగా ఉండడాన్ని నేర్పించవలసిన అవసరములేదు, కానీ వారికి మంచిగా ఉండడాన్ని నేర్పించాలి. వారికి అబద్ధం చెప్పడం నేర్పించాల్సిన అవసరం లేదు, కానీ నిజం చెప్పడానికి వారికి నేర్పించాలి. కావున ఒక వ్యక్తి చేసిన అపరాధమువలన మనుష్యులందరికి తీర్పు వచ్చినట్లు తీర్పు తీర్చబడినది" (రోమా 5:18).

### ఆపాదించబడిన పాపము

ధర్మశాస్త్రము ఇవ్వబడిన తరువాత, ధర్మశాస్త్రమునకు విరోధముగా చేయబడిన పాపములన్నీ మానవునికి ఆపాదించబడ్డాయి (ఖాతాలో జమచేయబడ్డాయి) దీన్నే ఆపాదించబడిన పాపము అంటారు (రోమీయులకు 5:13).

### వ్యక్తిగత పాపము

మనిషి ఎంచుకోవడం ద్వారా పాపం చేస్తాడు. ఎందుకంటే అతను స్వభావంతో పాపి. కావున, పాపము మీపై ఆధిపత్యం కలిగి ఉంటుంది. ప్రతి మానవుడు ప్రతిరోజు చేసేదే ఈ పాపము. ఆదాము నుండి మనము పాప స్వభావమును వారసత్వముగా పొందాము గనుక, మనము వ్యక్తిగత, సొంత పాపములను, అంటే తెలియక చెప్పే అబద్ధముల నుండి తెలిసి చేసే చెడ్డ పనులు, హత్యల వరకు చేస్తాము. దీనినే వ్యక్తిగత పాపము అంటాము.

మిగిలినది వచ్చే సంచికలో....

– డా. జె. రత్నా గ్రేస్, వైజాగ్




# అద్భుతం

"ఇప్పుడందరికీ అద్భుతాలు కావాలి. అనుకున్న వెంటనే అన్నీ జరిగిపోవాలి. ఆకాశం ఊడి పడిపోవాలి. దానికోసం దురద చెవుల్ని తగిలించుకోడానికి, అబద్ధ బోధకుల్ని తయారు చేసుకోవడానికి వెనుకాడం. ఇక్కడి నుంచి అక్కడికి, అక్కడి నుంచి ఇక్కడికి తిరుగుతూ... దేవుడు నాకేం చేయలేదని బాధపడుతుంటాం. నాకేం చేశాడని ప్రశ్నిస్తుంటాం" వాక్యం వింటూ కుర్చీలో అసహనంగా కదిలింది సరోజ.

పాస్టర్ గారు అద్భుతాలు చేస్తాడని ఆ నోటా ఈ నోటా వింది. ఆయన ప్రార్థన చేస్తే రోగాలన్నీ చిటికెలో మాయమవుతాయని ఎందరో చెప్పగా వింది. ఎన్ని మందులు వాడినా తగ్గని నడుం నొప్పితో రెండు వారాలుగా ఈ చర్చికి రావడం మొదలుపెట్టింది. చర్చికి వచ్చిన మొదటి రోజే కొత్తా పాతా లేకుండా అందరితో మాట్లాడి పాస్టర్ గారి గురించి ఎంక్వైరీ చేసింది. ఆయన ప్రార్థన వల్ల రోగాలు తగ్గిన వాళ్ళని ఆరా తీసింది. ఏడు వారాలు మానకుండా వస్తే అద్భుతాలు జరుగుతాయని, ఆయన ప్రార్థన చేసి ఇచ్చిన కొబ్బరినూనె బాధ ఉన్న చోట రాసుకుంటే ఉపశమనం కలుగుతుందని చెప్పడంతో ఊపిరి పీల్చుకుంది.

పొద్దున్నే ఇంటి దగ్గర పనంతా చేసి కొడుకు ప్రజ్వల్ కాలేజీకి వెళ్ళాక నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఊరికి బయల్దేరుతుంది. అక్కడ ప్రార్థనలో పాల్గొని, అదయ్యాక పాస్టర్ గారితో ప్రార్థన చేయించుకుని సాయంకాలానికి ఇంటికి చేరుకుంటుంది.

ప్రతి ఆదివారం వెళ్లే చర్చిలో పాస్టర్ గారికి దేవుడు వాక్యం చెప్పే వరం ఇచ్చాడు గానీ, అద్భుతాలు చేసే వరం ఇవ్వలేదని చాలాసార్లు తనలో తనే బాధపడేది సరోజ. ఆయనకి ఆ వరమే ఉండి ఉంటే తనకు ఆ తిప్పలు తప్పేవని తనలో తనే మథనపడేది. ఎప్పుడైనా బాగా నడుం నొప్పితో ప్రార్థన చేయించుకోవడానికి వెళ్ళి తనకున్న బాధ గురించి చెప్తే ఆయన చిరునవ్వు నవ్వేవాడు. ప్రార్థన చేస్తానని చెప్పేవాడు. 'నువ్వు కూడా ఉపవాసముండి దేవుని సన్నిధిలో కనిపెట్టుకుని ఉండమనేవాడు'. అవన్నీ కుదిరే పనులేనా?

విపరీతమైన నొప్పుల వల్ల మోకాళ్ళ మీద ఉండలేదు. కూర్చుని ప్రార్థిద్దామంటే కళ్ళు మూసుకోగానే ఆకాశానికి చిల్లుపడి కుండపోతగా, వాన కురిసినట్టుగా ఆవలింతలు మొదలవుతాయి. ఏదో తెలియని మైకం కమ్ముకుంటుంది. నిద్ర లేవగానే క్యాలెండర్లోని వాక్యం చదివి 'మమ' అనిపిస్తుంది. పడుకునే ముందు 'దేవా నీకు వందనాలు' అని చెప్పి సరిపెట్టుకుంటుంది. ఆవలింతలు వచ్చినా, నిద్ర కమ్ముకొచ్చినా కారణం సాతానే అని కాసేపు తిట్టుకుంటుంది. ఇక ఇటువంటి పరిస్థితుల్లో ఉపవాసమంటే కష్టమే! నీరసం వల్ల కూర్చోలేదు, పడుకోలేదు! కాబట్టి తనకు బదులుగా పాస్టర్ గారు ప్రార్థన చేస్తే తను కూడా ఏకీభవించినట్లుగా అనుకుంటుంది.

❄ ❄ ❄

ప్రజ్వల్ మనసంతా గజిబిజిగా ఉంది. రోజూ కాలేజీకి వస్తున్నాడు పోతున్నాడు గానీ చదువు మీద మనసు లగ్నం చేయలేక పోతున్నాడు. తల్లి కష్టపడి తనని చదివిస్తోందని తెలుసు. తన మీద ఎన్నో ఆశలు పెట్టుకుందనీ తెలుసు. అయినా స్నేహితుల కోసం తల్లి మాటను పక్కన పెట్టాడు. యుక్త వయసులో తరిమే ఆలోచనలను అదుపు చేసుకోలేక పోయాడు. తప్పు చేస్తున్నాననే భావం ఏ మూలో అతన్ని ఆపుతున్నా స్నేహితులు కలిస్తే మళ్ళీ మామూలుగా మారి వాళ్లతో కలిసి లోకంలో పడిపోయేవాడు. దాని ఫలితంగా మొదటి సంవత్సరం నాలుగు సబ్జెక్టుల్లో

ఫెయిలయ్యాడు. తల్లికి చెప్పుకోలేక, ఏకాగ్రతతో చదవలేక తనలో తనే బాగా నలిగిపోయాడు.

కాలేజీ ఎదురుగా ఉన్న బెంచీమీద కూర్చున్న ప్రజ్వల్‌కి అనుకోకుండా ఒకసారి వసంత్‌తో పరిచయం ఏర్పడింది. కళ్ళు మూసుకుని తనలో తనే గొణుక్కుంటున్నట్లుగా కనిపించిన వసంత్‌ని చూసి ఆశ్చర్యపోయాడు. రెండు మూడుసార్లు అలాగే చూసిన తర్వాత ఉత్సుకత ఆపుకోలేక "అన్నా.. రోజూ చూస్తున్నాను. మీరేం చేస్తున్నారో నాకర్థం కావట్లేదు" అన్నాడు ప్రజ్వల్.

అతని వంక చిర్నవ్వుతో చూస్తూ "నీలాంటి తమ్ముళ్ళ కోసం ప్రార్థిస్తున్నాను" అన్నాడు వసంత్.

'అర్థం కాలేదన్నట్లుగా వసంత్ వంక చూశాడు.

"ఆంధ్రాని నాకివ్వు. లేదంటే నా ప్రాణాలు తీసుకో' అన్నాడు ఒక పెద్దాయన. ఇప్పుడు నేను కూడా 'ఈ కాలేజీని నాకివ్వు. లేదంటే నా ప్రాణాలు తీసుకో' అని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఏ దారిలో వెళ్లాలో తెలియక అయోమయంతో కొట్టుమిట్టాడుతున్న నీలాంటి తమ్ముళ్ల కోసం ప్రార్థిస్తున్నాను" అన్నాడు వసంత్.

ప్రజ్వల్ ఏమీ మాట్లాడలేదు. ఆపుకుందామనుకున్నా కన్నీళ్ళెందుకో ఆగలేదు. రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగాడు. వసంత్‌కి విషయం అర్థమైంది. ఆ వయసులో యువత మీద ఎన్ని ఒత్తిడులుంటాయో, తెలిసి కొన్ని, తెలియక కొన్ని ఎన్నెన్ని పొరపాట్లు చేస్తుంటారో గ్రహించాడు. ప్రజ్వల్ భుజం మీద చెయ్యేసి ఆదరణగా తట్టాడు. అతను కొంచెం కుదుటపడ్డాక అతని ఘోరమైన జీవితం గూర్చి తెలుసుకున్నాడు. ప్రేమగా ఓదార్చాడు. బైబిల్లో ఉన్న కొన్ని వాక్యాలు చదివి వినిపించాడు. వారం వారం జరుగుతున్న బైబిల్ స్టడీస్ గురించి చెప్పి తనని ఎప్పుడైనా కలవమని కాంటాక్ట్ నంబరిచ్చాడు. అది మొదలుకొని ప్రజ్వల్ క్రమంగా బైబిల్ స్టడీకి వెళ్ళడం అలవాటు చేసుకున్నాడు. తల్లి ద్వారా దేవుడి గురించి విన్నా పెడచెవిన పెట్టాడు. కానీ వ్యక్తిగతంగా రుచి చూసి తెలుసుకోవడంలో ఉన్న ఆనందాన్ని అనుభవించాడు. చెడ్డ స్నేహితుల్ని, అలవాట్లను క్రమ క్రమంగా వదిలేశాడు.

❄ ❄ ❄

ఐదు వారాలు గడిచిపోయాయి. సరోజ నడుం నొప్పిలో ఏ మార్పు లేదు. నొప్పిని భరించి అలాగే బస్సులో ప్రయాణం చేసింది. కాళ్ళు ఈడ్చుకుంటూ భారంగా ఇంటికి చేరుకుంది. ఇల్లు సమీపంలో ఉండగా కొడుకు ప్రజ్వల్ ఎవరో ఒకాయనతో మాట్లాడడం కనిపించింది. గబగబా ఇంటికి చేరుకుని 'ఎవరండీ మీరు? కొత్తగా వచ్చిన పాస్టర్ గారా?' అని అడిగింది.

ప్రజ్వల్ కల్పించుకుని 'అమ్మా... ఆయన పాస్టర్ గారు కాదు. అన్న పేరు వసంత్. వారం వారం మా కాలేజీ దగ్గరకొచ్చి నన్ను పలకరిస్తూ ఉంటాడు. అప్పుడప్పుడూ బైబిల్ స్టడీకి అని చెప్పి వెళ్తుంటాను కదా. ఈ అన్న దగ్గరకే' అన్నాడు.

'మరి పాస్టర్ గారు కాదన్నావుగా' నిష్టూరంగా అంటూనే చేతులు జోడించి వందనాలు చెప్పింది.

వసంత్ కల్పించుకుంటూ 'నేను పాస్టర్ని కాదమ్మా. మాస్టారిగా చేస్తున్నాను. కాలేజీలో చదివే పిల్లలకు సువార్త చెప్తుంటాను. ప్రజ్వల్ చురుకైన పిల్లోడు. దేవుణ్ని రక్షకునిగా నమ్మితే నరకం నుంచి తప్పించుకోవచ్చు. దేవుడు మంచి జీవితాన్ని ఇస్తాడు. పరిచర్యకు కూడా బాగా ఉపయోగపడతాడు. ఈ నెలలో ఇవాంజిలిస్టిక్ క్యాంప్ ఉంది. మూడు రోజులు క్యాంపులోనే ఉండాలి. మిమ్మల్ని అడుగుదామని వచ్చాను. ప్రజ్వల్‌ని పంపించండి. నేర్చుకుంటాడు' అన్నాడు.

సరోజ కొడుకు వంక చూసింది. కాలేజీకి వెళ్తున్న కొడుకు అక్కడ ఏమేమి పనులు చేస్తున్నాడో ఊళ్ళో వాళ్ల ద్వారా వింటూనే ఉంది. నిల దీసి అడుగుదామంటే పిల్లోడు ఏమైపోతాడోనని భయపడింది. కానీ దేవుడు కొడుకు జీవితంలో చేసిన అద్భుతం ఆమెను ఆశ్చర్యపరచింది. తప్పిపోయిన కొడుకు ఇల్లు వెతుక్కుంటూ వచ్చినట్లుగా సంబరపడింది.

వసంత్ వైపు తిరిగి "వాడికి ఇష్టమైతే నాదేముంది బాబూ. చెప్పిన మాట వినకుండా ఊరిలో కుర్రోళ్ళంతా చెడిపోతున్నారు. గట్టిగా మందలిస్తే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పోనీ, ఊరు దాటితే బాగుపడతారని హాస్టల్లో చేర్పిస్తే అక్కడ పరిస్థితి మరీ ఘోరంగా ఉందని తెలిసింది. సెల్ఫోన్లు, ప్రేమలు, అమ్మాయిల వెనకాల తిరగడం, సిగరెట్లు, సినిమాలతో కాలం గడిపేస్తున్నారు. ఈ అలవాట్లు మానేదెప్పుడు? చదువుకుని బాగుపడేదెప్పుడు? ఏ సంబంధమూ లేకపోయినా మీలాగా చదువుకున్నోళ్ళు

కాలేజీలకు, హాస్టళ్లకు వెళ్లి దేవుడి గురించి నాలుగు మంచి మాటలు చెప్పి నలుగురు పిల్లల్ని బాగుచేస్తానంటే తల్లిగా నాకు కూడా ఆనందమేగా బాబూ' అంది.

వసంత్ పైకి లేచి సరోజ వైపు చూస్తూ 'చాలా సంతోషమమ్మా. పిల్లలకు మనమిచ్చే ఆస్తి కేవలం చదువు చెప్పించడమే కాదు, వాళ్ళ ప్రవర్తన చక్కదిద్ది సరైన దారిలో నడిపించాలి. ఆ దారి యేసుక్రీస్తులోనే ఉంది. అలా విద్యార్థుల్ని నడిపించడానికి దేవుడు నాకు, నాలాంటి గ్రాడ్యుయేట్స్‌కి సాయం చేస్తున్నాడు. మన కోసం తెలిసిన వాళ్ళూ, పాస్టర్లూ ప్రార్థన చేస్తూనే ఉంటారు. కానీ మనం కూడా వ్యక్తిగతంగా దేవుని సన్నిధిని అనుభవించాలి. మీరు కూడా వ్యక్తిగతంగా ప్రార్థన చేసుకోండి. కన్నీళ్ళతో దేవుణ్ణి అడగండి. మీ కష్టాలను దేవుని సన్నిధిలో కుమ్మరించండి. అప్పుడు దేవుడు మీ జీవితంలో అద్భుతాలు చేస్తాడు. మీ బాధల నుంచి విడిపిస్తాడు" అన్నాడు.

'అద్భుతం' అన్న మాట వినగానే సరోజ ఉలిక్కిపడింది. వసంత్ వంక అయోమయంగా చూసింది. వ్యక్తిగత ప్రార్థనను గాలికొదిలేసి 'స్వస్థత కలుగుతుంది' అని తెలిసిన చోటికల్లా పరుగులు తీసింది. 'ప్రార్థన' అనే మందును పక్కన పెట్టేసి ఏవేవో ప్రయత్నాలు చేసినందుకు తనలో తానే సిగ్గుపడింది. ఇకనుంచైనా రోజూ కొద్ది సమయం వ్యక్తిగతంగా ప్రార్థనలో గడపాలని నిర్ణయించుకున్నాక ఆమె మనసు తేటపడింది. వసంత్‌తో కలిసి ప్రార్థనలో ఏకీభవించింది.

❄ ❄ ❄

ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌కు వెళ్ళి వచ్చిన తర్వాత ప్రజ్వల్ జీవితం అనూహ్యంగా మారింది. చెడు అలవాట్లను విడిచి బుద్ధిగా కష్టపడి చదవడం ప్రారంభించాడు. తన జీవితాన్ని మార్చేది యేసుప్రభువే అని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్నాడు. తన స్నేహితుల మార్పుకోసం దేవుని సన్నిధిలో కన్నీళ్ళతో ప్రార్థించేవాడు. రక్షణ లేకపోతే వారంతా నరకానికే వెళతారని తెలిసి దేవుని నమ్ముకోమని వారిని బ్రతిమాలేవాడు. ఫలితంగా కొంతమంది దేవుని నమ్మారు. తన మార్పు తన కుటుంబానికి, వారి ఊరికి గొప్ప ఆశీర్వాదంగా మారింది.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు




మారిన వ్యక్తివి – ఇతరులను ప్రభు కొరకు
మార్చాల్సిన వాడివి
మారిపోతున్న లోకంలో – మొండిగా ప్రభుకోసం
నిలబడాల్సిన వాడివి
ముభావంగా, పట్టీపట్టనట్లు ఉంటున్నావు
ఇలా ఎందుకో మరి ......??

క్యాంపులకు వెళ్తావు,
బైబిల్ స్టడీలు తీసుకుంటావు
గుంపులో అందరూ సమానమే అంటావు
సహవాసంలోనూ సంతోషంగా కనిపిస్తావు కాని...
కులాన్ని మాత్రం భుజాన మోస్తూనే ఉంటావు
కనపడకుండా కూటమిని ఏర్పాటు చేస్తూనే ఉంటావు
ఇలా ఎందుకో మరి ......??

పాటలు పాడుతుంటావు ,
వాక్యాన్ని చదువుతూనే ఉంటావు
క్రీస్తుని ఎరుగని వారే కట్నం తీసుకునే వాడిని
గాడిదతో పోలుస్తుంటే
పెళ్లి సమయంలో మాత్రం మాటలు రాని వాని వలె
మూటలు మీదేసుకుంటావు,
లోకంలో వారికి ఏమాత్రం తీసిపోనట్లుంటావు
ఇలా ఎందుకో మరి ......??

పరిశుద్ధత మీద ప్రసంగాలు చేస్తావు
పదిమందిలో పాపులారిటి సంపాదిస్తావు
మోహపు చూపే పాపం అన్న
ప్రభువు మాటను మాత్రం పట్టించుకోవు,
జారత్వం అనే బండపై జారి పడుతూనే ఉంటావు.
ఇలా ఎందుకో మరి ......??

ఆత్మలో ఎదిగే కొలది ఆత్మీయతలో పై విషయాలే
వెదకాలి కానీ
ఇంకా కిందనే వెతుకులాడుతున్నావు
ఇలా ఎందుకో మరి ......??

ప్రభు రాకడ ఏ రోజైనా ఉండొచ్చు
ఇకనైనా
ఆశ్రయించు ప్రభు పునరుత్థాన శక్తిని
పారద్రోలు సాంఘిక దురాచార శక్తులని
కనపరచు భావి తరాలకు నీ నడతలలో మాదిరిని

**– జెస్సి రామ్మోహన్,** కొల్లిపర

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**
**Date of Printing: 25-06-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

# నీకేమైంది?



మనసా...
నమ్మిన తొలినాళ్ళలో...
భావితరానికి బాటగా
నవతరానికే నాందిగా
లేవాలి నీ సాక్ష్యం
అంటూ పాడుకున్న పాటలు
లోకానికి ఉప్పై ఉండాలని
వెలుగై ఉండాలని
గొంతెత్తి పాడిన గీతాలు
ఇప్పుడు ఏ అపశృతుల్లో
కలిసిపోయాయి?

కులం చూడను
కట్నం తీసుకోను
లంచం ఇవ్వను
లంచం పుచ్చుకోను
అవినీతికి ఆమడ దూరంలో ఉంటానని
శిక్షణా శిబిరాల ముగింపుల్లో
చేసిన శపథాలు
తీసుకున్న నిర్ణయాలు
ఏ తీరాన్ని చేరుకున్నాయి?
ఏ సముద్రం అడుగుకు చేరాయి?

ఆదిలో ఆత్మానుసారంగానే
ఆరంభించావే...
ఇప్పుడు శరీరానుసారంగా
ముగించడానికి
కారణాలేవో?
కారకాలేవో?
సంపూర్ణత వైపుకు సాగిపోతూ
లోకాన్ని ప్రభావితం చేయాలనుకున్నావే
లోకమే నిన్ను ప్రభావితం చేస్తుంటే
చీమ కుట్టినట్టు కూడా లేదా?
చీము పట్టినట్టయినా తెలియడం లేదా?

సమాజానికి పట్టిన తుప్పును
శుద్ధి చేయాలనుకున్న నీవే
చెదలు పట్టిపోతే ఎలా?
క్రీస్తును చూపాలనుకున్నావు కానీ
మహిమంతా నీకే కావాలనుకుంటున్నావు
ఇప్పటికైనా కళ్ళను తెరువు
నీ చుట్టూ పేరుకున్న కుళ్ళును చూడు
అచ్చమైన క్రీస్తులా జీవించు
స్వచ్ఛమైన సాక్ష్యంతో ప్రకాశించు.

– గొంగటి మేరిజాయ్, ఆదోని

UESI PUBLICATION TRUST - ANDHRA PRADESH BRANCH

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 0 07. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508